



# విశ్వం వాయిస్


అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును




సంప్రదించవలసిన నెంబర్లు

కె. అబెడ్నేగో(రాజు బాబు ) : 9985998066

సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 163 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ శుక్రవారం 06 మార్చి 2026 పేజీలు : 12 వెల : 2/-




## వెట్లపాలెంలో

# మారణహోమంపై ఎస్పీ సీరియస్!

### నిందితులకు కఠిన శిక్ష తప్పదు : కాకినాడ ఎస్పీ జి.బిందు మాధవ్

### లాభాపేక్షతో నిబంధనలు గాలికొదిలేసిన యజమానులు... - 28 మంది ప్రాణాలను బలితీసుకున్న నిర్లక్ష్యం

**కాకినాడ, (విశ్వం వాయిస్ క్రైమ్ న్యూస్):** సామర్లకోట మండలం వెట్లపాలెంలో జరిగిన బాణా సంచా ప్రమాదంపై కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్, ఐపీఎస్ గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఘోర ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు మిగతా .. 2లో..

### విచారణలో వెల్లడైన కీలక అంశాలు

- **నిబంధనల ఉల్లంఘన :** లైసెన్స్ గడువు ముగుస్తుందనే తొందరలో భద్రతా ప్రమాణాలను పూర్తిగా విస్మరించి తయారీ కొనసాగించడంతో ఈ ప్రమాదం జరిగిందని ఎస్పీ తెలిపారు.
- **అక్రమ నిల్వలే ప్రధాన కారణం :** నిర్ణీత పరిమితికి మించి మందుగుండు సామాగ్రిని కార్యాలయం మరియు నివాస ప్రాంతాల్లో నిల్వ చేయడం పేలుడు తీవ్రత పెరగడానికి కారణమైందని వెల్లడించారు.
- **నిందితులపై కఠిన చర్యలు :** పరారీలో ఉన్న నిందితులను చాకచక్యంగా సామర్లకోట రైల్వే స్టేషన్ వద్ద అదుపులోకి తీసుకున్నామని, వారిపై నాన్-బెయిలబుల్ సెక్షన్లతో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.
- **బాధితులకు భరోసా :** మృతుల కుటుంబాలకు పోలీస్ శాఖ పూర్తి అండగా ఉంటుందని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ హామీ ఇచ్చారు.

### నిందితుల అరెస్ట్ వివరాలు

పరారీలో ఉన్న అడబాల అర్జున్ (ఎ1) మరియు అడబాల వీరబాబు (ఎ2) లను పెద్దాపురం ఇన్చార్జ్ డీఎస్పీ బృందం గురువారం మధ్యాహ్నం సామర్లకోట రైల్వే గూడ్స్ షెడ్ వద్ద అరెస్ట్ చేసింది. వీరిపై బి.ఎన్.ఎస్ (దీచీూ) సెక్షన్లు 105, 125(ూ), 125(డీ), 288 మరియు ఎక్స్‌ప్లోజివ్స్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వివరించారు.

### అమాయక బలులు - 28 మంది మృతుల జాబితా :

ఈ మారణహోమంలో ప్రాణాలు కోల్పోయిన 28 మంది అమాయక కూలీల వివరాలు: అధిక సంఖ్యలో వెట్లపాలెం, సామర్లకోట, జి.మెడపాడు గ్రామాలకు చెందిన వారే ఉండటంతో ఆయా గ్రామాలు శోకసముద్రంలో మునిగిపోయాయి.

కడింపల్లి కృపమ్మ (45), మండపల్లి చిన్ని (45), దరిసిపాటి లోవరాజు (38), గంపాల మంగమ్మ (45), గొడత మహేష్ (40), దరిసిపాటి రాజు (28), గంపాల నాగరాజు (55), దరిసిపాటి నాని ఏ యోహాన్ (38), వేమగిరి లోవరాజు (35), బిక్కిన కరుణ సుబ్బారావు (45), ఏడిద సంపత్ కుమార్ (25), పల్లపాటి వీర శ్రీనివాస్ (48), గండి మంగా (36), నూకెల్ల దేవి (45), చిటికెల లక్ష్మి (52), వల్లూరి రవి (35), గొడత వీర వెంకట రమణ (48), కాతేటి శ్రీను (33), సదనాల సత్యవేణి (44), కడింపల్లి ధనరాజు (50), మొర్తా శ్రీను (30), గోడత నాని (25), సక్కుమల్ల రాఘవ (45), సప్ప సత్యవేణి (34), తుంపాల లోవ (38), ఆదబాల శ్రీనివాసరావు (55), చింతల రమణమ్మ (60), మకర రాఘవమ్మ (55).

#### సైనిక ఘర్షణల ద్వారా

## సమస్యలను పరిష్కరించలేం


### ప్రధాని నరేంద్ర మోదీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** సైనిక ఘర్షణల ద్వారా ఏ సమస్యనూ పరి ష్కరించలేమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో యుద్ధాలకు త్వరగా ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. భారత్ పర్యటనలో ఉన్న ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో చర్చలు నిర్వహించిన అనంతరం ప్రధాని మోదీ మాట్లాడారు. ఇటీవల ఈయూతో కుదుర్చుకున్న 'స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం'.. భారత్, ఫిన్లాండ్‌ల మధ్య వాణిజ్య సంబంధాలను బలోపేతం చేస్తుందన్నారు. "భారత్, ఫిన్లాండ్‌లకు చట్టబద్ధ పాలన, చర్చలు, దౌత్యమార్గాలపై విశ్వాసం ఉంది. కేవలం సైనిక ఘర్షణల ద్వారా సమస్యలను పరిష్కరించలేం. అది ఉక్రెయిన్, మిగతా .. 2లో..

#### అమెరికా ట్యాంకర్‌పై

## ఇరాన్ దాడి



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియాలో తీవ్రస్థాయి లో యుద్ధం కొనసాగుతోంది. హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ దేనాపై అమెరికా దాడి చేసి, ముం చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఇరాన్ దీనికి ప్రతీ కారం తీర్చుకున్నట్లు తెలుస్తోంది. గల్ఫ్‌లోని అమెరికా ట్యాంకర్‌పై దాడి చేసినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇరాన్ మీడియా ప్రకారం.. పర్షియన్ గల్ఫ్‌లోని యూఎస్ ట్యాంకర్‌పై క్షిపణితో దాడి చేశామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ ప్రకటించింది. నౌక నుంచి భారీ ఎత్తున మంటలు ఎగిసిపడుతున్నట్లు వెల్లడించింది. ప్రాణ నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు. తమ యుద్ధనౌకపై దాడికి ప్రతిస్పందనగానే దాడి జరిగిందని ఇరాన్ అధికారులు పేర్కొన్నారు. దీనిపై ఇరాన్ ప్రభుత్వం మిగతా .. 2లో..

#### రూ.6 వేల కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా

## 200 సబ్ స్టేషన్ల నిర్మాణం

- విద్యుత్ సరఫరా ఇబ్బందులు లేకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యం
- కూటమిలో పరిశ్రమల రాకతో పెరుగుతోన్న విద్యుత్ వినియోగం
- అధిక లోడ్ ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు, పవర్ స్టేషన్ల నిర్మాణం
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో విద్యుత్ లోడ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణానికి రూ.6 వేల కోట్లతో పనులు చేపట్టినట్లు ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అదితి విజయ లక్ష్మి గజపతిరాజు, కోళ్ల లలిత కుమారి, ముత్తుముల అశోక్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో విద్యుత్ లోడ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో 200కు పైగా 33/11 కేవీ సబ్ స్టేషన్ల అవసరం ఉందని గుర్తించి, వాటి నిర్మాణానికి చర్యలు చేపట్టామని మంత్రి వెల్లడించారు. విజయనగరం జిల్లా వేణుగోపాలపురం సబ్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రస్తుతం రీటెండరింగ్ దశలో ఉన్నాయని, 2027 మార్చి నాటికి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే విజయనగరం జిల్లాలో రూ.46 కోట్ల వ్యయంతో మిగతా .. 2లో..

#### ఉగాది రోజున లక్ష టిడ్కో ఇళ్లు

## లబ్ధిదారులకు అందజేస్తాం

- దేశంలో ఎక్కడా జరగనంత భారీగా గత ప్రభుత్వంలో టీడీఆర్ స్కాం జరిగింది
- గత ప్రభుత్వం అన్న క్యాంటీన్లు మూసేసి పేదల కడుపు కొట్టింది
- రాష్ట్రంలో త్వరలో మరో 6 వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ లు ఏర్పాటు
- 2028 నాటికి రాష్ట్రంలో ప్రజలందరికీ సురక్షితమైన తాగునీరు అందిస్తాం
- అమరావతి నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేస్తాం
- మున్సిపాల్టీలకు స్వయంప్రతిపత్తి కల్పించేలా సీఎం తీసున్న నిర్ణయానికి ధన్యవాదాలు
- బడ్జెట్ డిమాండ్స్‌పై చర్చ సందర్భంగా అసెంబ్లీలో మంత్రి నారాయణ



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** వచ్చే ఉగాది రోజు రాష్ట్రంలో లక్ష మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందజేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. జూన్ నాటికి టిడ్కో ఇళ్ల ను పూర్తి చేయడంతో పాటు 2028 కల్లా ప్రజలందరికీ సురక్షితమైన తాగునీరు అందించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళు తున్నామని మంత్రి చెప్పారు..గౌరవ ముఖ్యమంత్రి గారి సలహాలు,సూచనలతో పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ ద్వారా ప్రజలకు విస్తృతంగా మెరుగైన సేవలు అందిస్తున్నామని అన్నారు..శాసనసభలో సాధారణ బడ్జెట్ డిమాండ్స్ పై చర్చ సందర్భంగా తన శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై మంత్రి వివరణ ఇచ్చారు. పట్టణ ప్రాంతాల్లో జనాభా రోజురోజుకూ పెరుగుతుందని, 2001లో 24.2 శాతం జనాభా ఉంటే 2011 నాటికి ప్రస్తుతం 36 శాతం ఉన్నదని, 2047 నాటికి ఇది 60 శాతానికి పెరిగే అవకాశం ఉందన్నారు.ఈ అంచనాలకు అనుగుణంగా పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నామన్నారు. 2014-19 మధ్య కాలంలో మున్సిపాల్టీల నుంచి పన్నుల రూపంలో వచ్చే మిగతా .. 2లో..

#### సచిన్‌కుమారుడి వివాహ వేడుకకు హాజరైన

## మంత్రి లోకేష్ దంపతులు




**ముంబయి, విశ్వం వాయిస్ న్యూస్ :** క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడి వివాహ వేడుకకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, బ్రాహ్మణి దంపతులు హాజరయ్యారు. ఈ ఉదయం ముంబయి చేరుకున్న మంత్రి లోకేష్ దంపతులు అక్కడ సెయింట్ రెజిస్ హోటల్ లో జరిగిన సచిన్ టెండూల్కర్ కుమారుడి వివాహ మహోత్సవంలో పాల్గొన్నారు. సచిన్ టెండూల్కర్ కుటుంబం మంత్రి లోకేష్ దంపతులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మిగతా .. 2లో..

#### ప్రకృతి వైపరీత్యాల్లో

## రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

- ఇన్‌పుట్ సబ్సిడీ హెక్టారుకు రూ.25 వేలకు పెంచిన ఘనత మా ప్రభుత్వానిదే
- రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు
- మండలిలో సభ్యుల ప్రశ్నలకు సమాధానమిచ్చిన మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో ప్రభుత్వం సహాయం అందిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో ఇటీవల సంభవించిన ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్ట పోయిన రైతులకు నష్టపరిహారం అందిం చడం,అరకులో కాఫీ తోటల నష్టంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం తీసుకున్న చర్యలను మిగతా .. 2లో..

#### మగ్గం మీదే నేసే వస్త్రాలనే

## కొనుగోలు చేస్తాం

- ఎమ్మెల్యేలు, అధికారులతో కీలక భేటీ
- చేనేత రంగ అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం : మంత్రి సవిత



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** మగ్గం మీదే నేసే వస్త్రాలను మాత్రమే ఆప్కో ద్వారా కొనుగోలు చేస్తామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. ఆప్కో బ్రాండ్ మరింత పెంచేలా షో రూమ్‌ల్లో నాణ్యమైన చేనేత వస్త్రాలను మాత్రమే విక్రయించనున్నామన్నారు. గురువారం విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో మిగతా .. 2లో..

#### 'ఆశా'ల కోర్కెల పరిష్కారం పట్ల

## సానుకూలంగా ఉన్నాం

- దహన సంస్కారాల చెల్లింపు విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉంది
- కొత్త చరవాణులు, యూనిఫాంలు త్వరగా ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం
- ఇతర అంశాలపై సీఎం చంద్రబాబుతో చర్చిస్తా
- ఆశా యూనియన్ ప్రతినిధులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ హామీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఆశాల వర్కర్ల కోర్కెల పరిష్కారంపట్ల కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ముఖ్య మిగతా .. 2లో..

#### రఘురామకృష్ణ రాజు

## కస్టోడియల్ టార్చర్ కేసు

- విచారణకు హాజరైన ఐపీఎస్ సునీల్ నాయక్
- నేటి నుంచి 9వ తేదీ వరకు కొనసాగనున్న విచారణ



**విశ్వం వాయిస్ న్యూస్ :** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో, 2021 మే నెలలో నరసాపురం ఎంపీగా ఉన్న రఘు రామకృష్ణరాజును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అరెస్టు చేసి గుంటూరు సీఐడీ కార్యాలయానికి తరలించిన సంగతి తెలిసిందే. ఆ రోజు రాత్రంతా ఆయనను సీఐడీ కార్యాలయంలోనే ఉంచారు. ఆ సమయంలో సీఐడీ డీఐజీగా ఉన్న సునీల్ నాయక్, ఆ రాత్రి వేళ పలుమార్లు సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి వెళ్లినట్లు దర్యాప్తులో ఆధారాలు లభించాయి. దీంతో, ఆయనను మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# వెట్లపాలెం మారణహోమంపై ఎస్పీ సీరియస్!

తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 28కి చేరడం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

**ఎస్పీ హెచ్చరిక: ఉపేక్షించేది లేదు!**

“జిల్లాలో ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా బాణాసంచా తయారు చేసినా, అక్రమంగా నిల్వ చేసినా ఉపేక్షించేది లేదు. ప్రతి యూనిట్‌లోనూ తనిఖీలు నిర్వహించి భద్రతా ప్రమాణాలు పాటించని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం” అని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ గట్టిగా హెచ్చరించారు.

# సమస్యలను పరిష్కరించలేం

లేదా పశ్చిమాసియా.. ఏదైనా కావచ్చు. వివాదాలను వీలైనంత త్వరగా ముగించేందుకు, శాంతిని నెలకొల్పేందుకు చేసే ప్రతి ప్రయత్నానికి మద్దతు ఇస్తూనే ఉంటాం” అని మోదీ తెలిపారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ప్రధాని వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఫిన్లాండ్ అధ్యక్షుడితో చర్చల్లో భాగంగా ఇరుదేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. “ఏఐ నుంచి 6జీ వరకు, క్లీన్ ఎనర్జీ నుంచి క్వాంటం కంప్యూటింగ్ వరకు అనేక హైటెక్ రంగాల్లో పరస్పర సహకారానికి కట్టుబడి ఉన్నాం” అని చెప్పారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు స్టబ్ నాలుగు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం భారత్‌కు వచ్చారు. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ పర్యటన చేపట్టారు.

**అమెరికా ట్యాంకర్‌పై**

# ఇరాన్ దాడి

అధికారికంగా ప్రకటించలేదు. అటు అమెరికా కూడా దీనిపై ఇంకా స్పందించలేదు. భారత్‌లోని విశాఖపట్నం నుంచి ఇరాన్‌కు తిరిగి వెళ్తున్న ఐరిస్ దేనా-75పై అమెరికా జలాంతర్గామితో దాడి చేసిన సంగతి తెలిసిందే. దాడి సమయంలో నౌకలో 180 మంది సిబ్బంది ఉన్నారు. వారిలో 87 మంది ప్రాణాలు కోల్పోగా.. మరికొంతమందిని శ్రీలంక దళాలు రక్షించాయి. మరికొంతమంది గల్లంతయ్యారు. అమెరికా దాడికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ హెచ్చరించారు. ఈ క్రమంలో యూఎస్ ట్యాంకర్‌పై దాడి జరగడం గమనార్హం.

**రూ.6 వేల కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా**

# 200 సబ్ స్టేషన్ల నిర్మాణం

220 కేవీ, 132 కేవీ లైన్ల పనులు పూర్తి అయ్యాయని, వాటిని త్వరలో చార్జ్ చేసేందుకు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అదేవిధంగా వేణుగోపాలపురంలో రూ.77 కోట్లతో సబ్ స్టేషన్ పనులు కొనసాగుతున్నాయని మంత్రి గొట్టిపాటి సభకు వివరించారు. విజయనగరంలో కూడా విశాఖపట్నం తరహాలో అండర్ గ్రౌండ్ కేబులింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అదితి గజపతి రాజు కోరగా, ఆ వ్యవస్థ ఖర్చుతో కూడుకున్నదని మంత్రి గొట్టిపాటి తెలిపారు. నిధుల లభ్యత, అవసరాన్ని బట్టి ఆ అంశాన్ని పరిశీలిస్తామని స్పష్టం చేశారు. గిద్దలూరు నియోజకవర్గంలో 220 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కోరగా, విద్యుత్ శాఖ ఫీజిబిలిటీ రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన పెరిగిందని, దీంతో రోజువారీ విద్యుత్ వినియోగం 263 మిలియన్ యూనిట్ల నుంచి 280 మిలియన్ యూనిట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. ఈ పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ ఉత్పత్తి పెంపుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 400 కేవీ, 220 కేవీ, 132 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. అలాగే రైతులకు పెద్దఎత్తున వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని, వ్యాపార, పారిశ్రామిక, గృహ అవసరాల కారణంగా విద్యుత్ వినియోగం పెరిగిందని చెప్పారు. భవిష్యత్తులో రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కొరత లేకుండా చూడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలు, పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని లోడ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో 33/11 కేవీ సబ్ స్టేషన్లు, విద్యుత్ లైన్ల నిర్మాణాన్ని రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.

**ప్రకృతి వైపరీత్యాల్లో**

# రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

మంత్రి శాసన మండలిలో వివరించారు. నష్టపోయిన ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ అధికారులు ఫీల్డ్ స్థాయిలో పంట నష్టాన్ని వారం రోజుల్లో అంచనా వేసి నివేదికలు సిద్ధం చేశారని, ఆ నివేదికల ఆధారంగా అర్హులైన రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందచేశామని మంత్రి పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సహాయాన్ని త్వరితగతిన అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

**ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీపై ప్రభుత్వం చర్యలు**

రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో సహాయం అందిస్తున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. గతంలో 2014 వరకు పత్తి, వేరుశెనగ, వరి, చెరుకు పంటలకు హెక్టారుకు రూ.12,000 ఇన్‌పుట్ సబ్సిడీని అందించేసేవారని, 2014 లో తెదేపా ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం చంద్రబాబు రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ మొత్తాన్ని హెక్టారుకు రూ.17,000కు పెంచినట్లు వివరించారు. అయితే గత వైసీపీ పాలనలో ఆ మొత్తాన్ని తిరిగి రూ.12,000కు తగ్గించారని మంత్రి పేర్కొన్నారు. 2024 లో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక బుడమేరు వరదల సమయంలో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఆలోచించి హెక్టారుకు రూ.25,000 వరకు నష్టపరిహారం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. బుడమేరు వరదల అనంతరం కేవలం వారం రోజుల్లోనే సర్వే పూర్తి చేసి సుమారు రూ.370 కోట్ల నష్టపరిహారాన్ని రైతులకు అందించామని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో రైతులతో పాటు కౌలు రైతులకు కూడా నష్టపరిహారం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని మంత్రి స్పష్టం చేశారు. ఇటీవల సంభవించిన తుఫాన్లకు సంబంధించి కూడా ప్రభుత్వం వెంటనే స్పందించి ఇప్పటికే రూ.25 కోట్లు, రూ.34 కోట్లు, రూ.310 కోట్ల వరకు రైతులకు నష్టపరిహారం చెల్లించిందని తెలిపారు. ఇటీవల వచ్చిన మొందా తుఫాన్‌కు సంబంధించిన నష్టాల సర్వే పూర్తయిందని, కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కూడా నష్టపరిహారం అందజేస్తుందని మంత్రి పేర్కొన్నారు.

**పంటల భీమా వ్యవస్థపై వివరణ**

పంటల భీమా విషయంలో గత ప్రభుత్వ విధానం వల్ల రైతులకు ఇబ్బందులు తలెత్తాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి పసల్ భీమా యోజనలో దేశంలోని అనేక రాష్ట్రాలు భాగస్వామ్యం అయినప్పటికీ, గత ప్రభుత్వం ఉచిత భీమా పేరుతో వేరే విధానాన్ని తీసుకువచ్చిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం స్వయంగా ఇన్సూరెన్స్ కంపెనీ ఏర్పాటు చేయాలని ప్రయత్నించిందని, కేంద్ర ప్రభుత్వం ఆ విధానం సాధ్యం కాదని సూచించిందని చెప్పారు. ఐదేళ్ల కాలంలో ఒక ఏడాది మాత్రమే రైతులకు భీమా అందించబడిందని, అనంతరం కేంద్రంతో కలిసినప్పటికీ వైసీపీ ప్రభుత్వం తన వాటాగా చెల్లించాల్సిన సుమారు రూ.2000 కోట్లను మూడు సంవత్సరాల పాటు చెల్లించకపోవడంతో పోర్టల్ కూడా తెరవలేకపోయిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పౌరసరఫరాలు, వ్యవసాయ, ఆర్థిక శాఖల మంత్రులతో సబ్ కమిటీ ఏర్పాటు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించామని చెప్పారు. ప్రస్తుతం కేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మళ్లీ పంటల భీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి వివరించారు.

**అరకు కాఫీ తోటలపై వ్యాధి నియంత్రణ చర్యలు**

అరకు కాఫీ దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేశారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అరకు ప్రాంతంలోని కాఫీ తోటల్లో కాఫీ బెర్రీ బోరర్ వ్యాధి పరిమిత స్థాయిలో మాత్రమే గుర్తించబడిందని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో మొత్తం సుమారు 1.03 లక్షల హెక్టార్లలో కాఫీ సాగు జరుగుతుండగా, కేవలం 60.8 హెక్టార్లలో మాత్రమే ఈ వ్యాధి ప్రభావం కనిపించిందని తెలిపారు. సమస్య గుర్తించిన వెంటనే ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి శాస్త్రవేత్తలు, అధికారులు, కాఫీ బోర్డు ప్రతినిధులతో కలిసి పర్యవేక్షణ ప్రారంభించిందని చెప్పారు. వ్యాధికి గురైన 152 ఎకరాల్లోని 20,617 కిలోల కాఫీ కాయలను గుంతలు తవ్వి పాతిపెట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 530 మంది కూలీలు, ఉద్యాన, వ్యవసాయ శాఖ విద్యార్థులు మరియు ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు. నష్టపోయిన 81 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.7,23,825 ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. అరకు కాఫీ బ్రాండ్‌కు ఎలాంటి నష్టం కలగకుండా ప్రభుత్వం అప్రమత్తంగా చర్యలు తీసుకుంటుందని, ఎక్కడైనా వ్యాధి కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని మంత్రి సభ్యులకు విజ్ఞప్తి చేశారు.

**రఘురామకృష్ణ రాజు**

# కస్టోడియల్ టార్చర్ కేసు

ఈ కేసులో ఏ-7గా చేర్చారు. విచారణకు రావాలంటూ పలుమార్లు నోటీసులు ఇచ్చినా ఆయన హాజరు కాలేదు. ఈ క్రమంలో సునీల్ నాయక్‌ను అరెస్టు చేసేందుకు పోలీసులు పాట్నా వరకు వెళ్లినా, సాంకేతిక కారణాల వల్ల తీసుకురాలేకపోయారు. అయితే, ముందస్తు బెయిల్ కోసం ఏపీ హైకోర్టును ఆశ్రయించిన సునీల్ నాయక్‌కు నిరాశ ఎదురైంది. విచారణకు హాజరు కావాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో, ఆయన ఈరోజు విచారణకు హాజరయ్యారు. సాయంత్రం 5 గంటల వరకు సాగే ఈ విచారణలో ఆ రాత్రి జరిగిన పరిణామాలపై పోలీసులు ఆయన్ను ప్రశ్నిస్తున్నారు. 9వ తేదీ వరకు విచారణ కొనసాగనుంది.

# మంత్రి లోకేష్ దంపతులు

నూతన వధూవరులు అర్జున్ టెండూల్కర్, సానియా చందోక్ లను ఆశీర్వదించారు. వారికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకకు దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు తరలివచ్చారు.

# లబ్ధిదారులకు అందజేస్తాం

నిధులను గ్రీన్ ఛానల్ ద్వారా ఆయా మున్సిపాల్టీలకే ఖర్చు పెట్టామన్నారు..కానీ గత ప్రభుత్వం మున్సిపాల్టీల నిధులను కూడా సొంత అవసరాలకు వినియోగించేసుకుందన్నారు..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు గారు చొరవ తీసుకుని తిరిగి సీఎఫ్ఎంఎస్ తో సంబంధం లేకుండా మున్సిపాల్టీల నిధులు అక్కడే ఖర్చు చేసుకునేలా మార్పులు చేసారని అన్నారు....సీఎంగారు తీసుకున్న ఈ నిర్ణయం పట్ల రాష్ట్ర ప్రజల తరపున ఆయనకు ధన్యవాదాలు చెప్పారు మంత్రి నారాయణ.. ఈ బడ్జెట్‌లో మున్సిపల్ శాఖకు 14,538.68 కోట్లు కేటాయింపులు చేసారని..గత బడ్జెట్ కంటే ఇది 4.88 శాతం ఎక్కువ అన్నారు..ప్రజలు కోరుకునే తాగునీరు,ఘన,ద్రవ వ్యర్థాల నిర్వహణ,రోడ్లు,వీధి లైట్లతో పాటు ఇతర అవసరాలను ప్రాధాన్యతాక్రమంలో కల్పిస్తున్నామన్నారు నారాయణ... రాష్ట్రంలో 54,98,000 కొళాయి కనెక్షన్లు ద్వారా 3083 ఎంఎల్డీ తాగునీరు అందించాల్సి ఉండగా.....ప్రస్తుతం 38.48 లక్షల కనెక్షన్ల ద్వారా 2100 ఎంఎల్టీ నీరు అందిస్తున్నామన్నారు... మరో 16.5 లక్షల కనెక్షన్ల ద్వారా 983 ఎంఎల్డీ తాగు నీరు అందించాల్సిన అవసరం ఉందన్నారు...వీటిలో వివిధ పథకాల ద్వారా 941 ఎంఎల్డీల తాగు నీరు అందించేలా టెండర్లు పిలిచామన్నారు...అమృత్ పథకం ద్వారా 6,524 కోట్లతో ఏఐఐబీ ప్రాజెక్ట్ ద్వారా 2,461 కోట్లతో,యూఐడీఎఫ్ - 1 పథకం ద్వారా 1504 కోట్లతో పనులు ప్రారంభించేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని మంత్రి నారాయణ చెప్పారు.మొత్తంగా 11,937 కోట్లతో ప్రాజెక్ట్ చేపట్టినట్లు మంత్రి నారాయణ చెప్పారు. గత ప్రభుత్వం వివిధ కేంద్ర పథకాలకు రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయకపోవడంతో తాగు నీటి ప్రాజెక్ట్ లు పూర్తి కాలేదని మంత్రి నారాయణ అన్నారు...ఏఐఐబీ ద్వారా 2019 లో 5350 కోట్ల నిధులు విడుదలయితే గత ప్రభుత్వం మ్యాచింగ్ ఫండ్స్ విడుదల చేయకపోవడంతో ఆ నిధులు విడుదల కాలేదన్నారు...అలాగే అమృత్ ద్వారా 8500 కోట్లకు రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయలేదన్నారు...తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రంతో మాట్లాడి ఆయా పథకాల నిధులు విడుదల చేయించినట్లు మంత్రి నారాయణ చెప్పారు. గత ప్రభుత్వం చెత్త పన్ను వేసి చెత్తను మాత్రం తొలగించకుండా వెళ్లిపోయిందని మంత్రి ఆరోపించారు. భూమిపైన 85 లక్షల మెట్రిక్ టన్నులు,భూమి క్రింద 68 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త కలిపి మొత్తం 153 లక్షల టన్నుల చెత్త వదిలివెళ్లిపోయిందన్నారు..2024 అక్టోబర్ లో గౌరవ ముఖ్యమంత్రి గారి ఆదేశాల ప్రకారం ఏడాదిలోగా 85 లక్షల టన్నుల లెగసీ వేస్ట్ ను తొలగించామని వచ్చే జూన్ నాటికి మిగిలిన 68 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను పూర్తిగా తొలగిస్తామని చెప్పారు. 2014-19 మధ్యలో రాష్ట్రంలో 10 చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించగా...గత ప్రభుత్వం కేవలం విజయవాడ,విశాఖపట్నం మినహా మిగిలిన ప్రాజెక్ట్ లను పట్టించుకోలేదన్నారు.ప్రస్తుతం ఈ రెండు ప్లాంట్ల నుంచి 2800 టన్నుల చెత్తను విద్యుత్‌గా మారుస్తున్నామని. కాకినాడ,నెల్లూరు,కడప,కర్నూలులో కొత్తగా ప్లాంట్ల నిర్మాణం జరుగుతుందన్నారు. వీటితో పాటు విజయవాడ,తిరుపతిలో ప్లాంట్ల ఏర్పాటుకు కేంద్రంతో చర్చలు జరుపుతున్నామన్నారు...ఈ ప్రాజెక్ట్ లు పూర్తయితే రాష్ట్రంలో ప్రతిరోజూ ఉత్పత్తి అయ్యే 7000 టన్నుల ఘన వ్యర్థాలలో 6500 టన్నులు విద్యుత్ గా మారిపోతుందన్నారు. ఈ ప్లాంట్లు పూర్తయ్యే లోగా ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్లు ఏర్పాటుచేస్తామని చెప్పారు. ఇక డ్రెయిన్ల విషయానికొస్తే రాష్ట్రం మొత్తం మీద 46,900 కిమీ మేర అవసరం ఉండగా....23,350 కిమీ మాత్రమే ఉన్నాయన్నారు..మరో 23,610 కి.మీ మేర డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాల్సి ఉందని మంత్రి నారాయణ అన్నారు...ఈ మొత్తంలో ప్రాధాన్యతా క్రమంలో ప్రస్తుతం 9000 కోట్ల మేర పనులు చేపటడుతున్నట్లు మంత్రి చెప్పారు..అండర్ గ్రౌండ్ డ్రైనేజి ప్రస్తుతం 3,245 కిమీ ఉందని,మరో 2,809 కిమీ మేర పనులు జరుగుతున్నాయన్నారు...మరో 17,556 కిమీ మేర అవసరం ఉన్నప్పటికీ ఆ పనులు చేపట్టడానికి 36 వేల కోట్లు అవసరం అవుతుందన్నారు...ద్రవ వ్యర్థాల నిర్వహణ కోసం సీవరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్లు ఏర్పాటుచేస్తున్నట్లు మంత్రి నారాయణ చెప్పారు. రాష్ట్రంలోని మున్సిపాల్టీల్లో దేశంలోనే మొదటిసారిగా విశాఖపట్నంలో 99,000 వీధి లైట్ల ను ఎల్ ఈడీ లైట్లుగా మార్చినట్లు మంత్రి నారాయణ తెలిపారు.2014-19 మధ్యలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు టిడ్కో ద్వారా 7 లక్షల ఇళ్ల నిర్మాణానికి అనుమతులు తీసుకురాగా....3.8 లక్షల ఇళ్లు నిర్మాణం ప్రారంభమైంది...కానీ గత ప్రభుత్వం ఆ సంఖ్యను 2,61,000కు తగ్గించడమే కాకుండా వాటిని కూడా పూర్తి చేయకుండా మధ్యలో నిలిపివేసింది..ఇళ్లు నిర్మాణం ప్రారంభించిన కాంట్రాక్టర్లను ఇబ్బందిపెట్టింది..పాత కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా చెల్లించలేదని మంత్రి తెలిపారు...ప్రస్తుతం టిడ్కో ఇళ్లను పూర్తి చేసేందుకు హడ్కో ద్వారా రుణం తీసుకున్నామన్నారు..టిడ్కో ఇళ్లలో 365,430 చదరపు అడుగుల విస్తీర్ణంలో పెండింగ్ లో ఉన్న ఇళ్లను వచ్చే జూన్ నాటికి పూర్తి చేస్తామని చెప్పారు.వచ్చే ఉగాది నాటికి లక్ష టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్దిదారులకు అందిస్తామని మంత్రి చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లను తిరిగి పునరుద్దరించినట్లు మంత్రి నారాయణ చెప్పారు..పేదవాడికి కేవలం ఐదు రూపాయిలకే కడుపునిండా నాణ్యమైన అందించాలనే ఉద్దేశంతో ఈ క్యాంటీన్లను ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు...రాష్ట్రంలో ప్రస్తుతం 204 అన్న క్యాంటీన్లలో ప్రతిరోజూ రెండు లక్షల 25 వేల మంది నాణ్యమైన ఆహారం తీసుకుంటున్నారని అన్నారు...గత ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ఎందుకు మూసివేసిందో అర్ధం కాలేదన్నారు...త్వరలో గ్రామీణ ప్రాంతాల్లో కూడా అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నామన్నారు...విశాఖపట్నం,విజయవాడలో మెట్రో రైల్ ఏర్పాటు కోసం కేంద్రంతో సంప్రదింపులు చేస్తున్నామన్నారు మంత్రి నారాయణ......టీడీఆర్ బాండ్ల జారీలో దేశంలో ఎక్కడా లేనివిధంగా వందల కోట్ల అక్రమాలకు గత ప్రభుత్వం పాల్పడిందని మంత్రి నారాయణ చెప్పారు..తణుకు,తిరుపతిలో రిజిస్ట్రేషన్ వాల్యూకు అదనంగా 4 రెట్ల ధరతో బాండ్లు జారీ చేసారని అన్నారు..తణుకు లో 63.2 కోట్ల విలువ చేసే బాండ్లకు 691.4 కోట్ల విలువ చూపించారని....తిరుపతిలో 147 కోట్ల విలువ చూపించారని చెప్పారు...దీంతో అక్రమాలు జరిగిన బాండ్లు మినహా మిగతా వాటిని కొనుగోలు చేసిన వారికి జారీ చేసామని అన్నారు..ప్రస్తుతం టీడీఆర్ బాండ్ల అక్రమాలపై విజిలెన్స్ విచారణ కొనసాగుతుందన్నారు. అలాగే అమరావతి విషయంలో గత ప్రభుత్వం రైతులను ఎన్నో ఇబ్బందులకు గురిచేసిందన్నారు...న్యాయపరమైన సమస్యలు రాకుండా ఇంజినీర్ల కమిటీ వేసి అన్నీ క్లియర్ చేసేందుకు 8 నెలలు పట్టిందన్నారు..ప్రస్తుతం 360 కిమీ మేర ట్రంక్ రోడ్లు,1500 కిమీ మేర లే అవుట్ రోడ్లు,4026 ఇళ్లు,5 ఐకానిక్ భవనాలు,అసెంబ్లీ,హైకోర్టు నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని మంత్రి తెలిపారు..అమరావతి పనులు వేగంగా జరుగుతున్నాయని...మూడేళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు...ఎంఎల్ ఏ,ఎంఎల్ సి క్వార్టర్ల నిర్మాణాలను ఏప్రిల్ చివరికి పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు.

# కొనుగోలు చేస్తాం

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 70 చేనేత సహకార సంఘాల ప్రతినిధులతో రాష్ట్ర చేనేత, జౌళి శాఖాధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రూ.కోటీ 70 లక్షల విలువైన చేనేత వస్త్రాలను ఈ సమావేశానికి చేనేత సహకార సంఘాల ప్రతినిధులు తీసుకొచ్చారు. వాటిని పరిశీలించిన అధికారులు, కేవలం మగ్గంపైనే నేసిన రూ.కోటీ 40 లక్షల విలువైన చేనేత వస్త్రాలను అక్కడికక్కడే కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఆప్కో బ్రాండ్ ను మరింత విస్తరించే క్రమంలో ఆయా షో రూమ్ ల్లో కేవలం మగ్గం మీద నేసే చేనేత వస్త్రాలను మాత్రమే విక్రయించనున్నామన్నారు. పవర్ లూమ్ మగ్గాల మీద నేసే వస్త్రాలను ఆప్కో షో రూమ్ ల్లో విక్రయించేది లేదని స్పష్టం చేశారు. దీనిలో భాగంగానే మగ్గం మీద నేసే చేనేత వస్త్రాలను మాత్రమే చేనేత సహకార సంఘాల నుంచి కొనుగోలు చేస్తామన్నారు. ఈ నిర్ణయం వల్ల నేతన్నలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఏడాది పాటు ఉపాధి లభించే అవకాశం కలుగుతుందన్నారు. అదే సమయంలో వినియోగదారులకు నేతన్నలు నేసే నాణ్యమైన చేనేత వస్త్రాలు లభిస్తాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆప్కో షో రూమ్ ల్లో పవర్ లూమ్ చేనేత వస్త్రాలను విక్రయించిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. ఇకపై ఆప్కో ఇమేజ్ పెంచేలా నేటి ట్రెండ్ కు అనుగుణంగా నేతన్నలు చేనేత రెడీమేడ్ దుస్తుల తయారీపైనా దృష్టి పెట్టాలన్నారు. ఆసక్తి కలిగిన వారికి ఉచిత శిక్షణ సైతం అందిస్తున్నామన్నారు. ఇప్పటికే ఈ కామర్స్ ద్వారా ఆన్ లైన్ అమ్మకాలు ప్రారంభించామని, ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని మంత్రి సవిత వెల్లడించారు.

**చేనేత సమస్యలపై కీలక భేటీ**

చేనేత రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. దీనిలో భాగంగా నేతన్నల సమస్యల పరిష్కారంతో చేనేత రంగ అభివృద్ధిపై ఎమ్మెల్యేలు జయనాగేశ్వరరెడ్డి, జోగేశ్వరరావు, కృష్ణప్రసాద్, షాజహాన్ బాషాతో పాటు ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, అధికారులతో మంత్రి సవిత గురువారం రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్ భేటీ అయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 20 నెలల కాలంలో చేనేతల అభివృద్ధికి చేపట్టిన పథకాలను మంత్రి సవిత వివరించారు. నూతన టెక్స్ టైల్స్ విధానం రూపకల్పనతో రాష్ట్రంలో చేనేత రంగానికి కొత్త శకం మొదలైందన్నారు. నేతన్నల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఈ సందర్భంగా పలు చేనేత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి సవితకు ఎమ్మెల్యేలు వినతి పత్రాన్నిఅందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ప్రధాన ముఖ్యకార్యదర్శి ఆర్పీ సిసోడియా, కమిషనర్ రేఖారాణి తదితరులు పాల్గొన్నారు.

# సానుకూలంగా ఉన్నాం

ప్రతినిధులతో సచివాలయంలోని తన ఛాంబరులో గురువారం సాయంత్రం సమావేశమై వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఆశాల పనితీరు సంతృప్తికరంగా ఉందని, క్షేత్రస్థాయిలో వైద్య సేవలు మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన వెంటనే ఉద్యోగ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచిందన్నారు ప్రసూతి సెలవులు (6 నెలలు) మంజూరు చేసిందని పేర్కొన్నారు అంతేకాకుండా ఉద్యోగ విరమణ చేసిన వారికి గ్రాట్యూటీ కూడా ఇస్తున్నామని తెలిపారు. ఆశాల పనితీరును గుర్తించి, వారి నుంచి అభ్యర్ధనలు రాక మునుపే ప్రభుత్వం సానుకూల ఉత్తర్వులు జారీచేసిందన్నారు. ఇది కూటమి ప్రభుత్వానికి మాత్రమే సాధ్యమని పేర్కొన్నారు.

**1,234 ఆశాల ఖాళీలను భర్తీ చేశాం**

దహన సంస్కారాల కింద రూ 15,000 చెల్లించే విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందని మంత్రి పేర్కొన్నారు. ఇతర ఉద్యోగులకు మాదిరిగా సాధారణ సెలవులు మంజూరు విషయమై జాతీయ ఆరోగ్య మిషన్ మార్గదర్శకాలు అనుసరించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అశాల విజ్ఞప్తి మేరకు కొత్త చరవాణులు, రెండు చీరెలను (జార్జటు మెటీరియల్) ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రభుత్వం నిర్దేశించిన జాబు చార్టు ప్రకారమే విధులు నిర్వర్తించేలా జిల్లాలకు ఆదేశాలు పంపుతామని తెలిపారు. ఖాళీగా ఉన్న ఆశాల ఖాళీలను (1,363) భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం గడిచిన 20 నెలల్లో 1,234 అశాల ఖాళీలను భర్తీచేసిన విషయాన్ని ప్రతినిధులకు మంత్రి గుర్తుచేశారు. బీమా సౌకర్యం వర్తింపచేయడంలో సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తామన్నారు. ఆశాల సమస్యల గురించి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని మంత్రి వారికి వివరించారు.

**ప్రభుత్వ నిర్ణయాలపై సంతోషంగా ఉన్నాం.. ఆశా ప్రతినిధులు**

ఈ సందర్భంగా ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి, ఇతర ప్రతినిధులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగ విరమణ వయసు పెంపు, ప్రసూతి సెలవుల మంజూరు, గ్రాట్యూటీ చెల్లింపులపై ఉత్తర్వులు ఇవ్వడంపట్ల ఆశాలు సంతోషంగా ఉన్నారని తెలిపారు ప్రసూతి సెలవులు మహిళలకు బాగా ఉపయోగపడుతున్నాయని తెలిపారు ఆశాలకు కనీస వేతనం చెల్లించాలని, జాబుచార్టు ప్రకారమే విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని, ఖాళీగా ఉన్న ఆశాల పోస్టులు భర్తీచేయాలని, బీమా సౌకర్యాన్ని కల్పించాలని మంత్రికి విజ్ఞప్తిచేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, ఆశాల విధుల పర్యవేక్షణ అధికారి, సీఏఓ ప్రకాష్ రావు, మరో సీనియర్ అధికారి శ్యామల కూడా పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## సచివాలయం కాదు స్వర్ణ గ్రామం.. స్వర్ణ వార్డు

ఇదిలా ఉంటే ఇప్పటిదాకా గ్రామ, వార్డు సచివాలయాలుగా ఉన్న ఈ వ్యవస్థ పేరుని కూటమి ప్రభుత్వం మార్పు చేసింది. ఏపీలో సచివాలయాలకు పేరు మార్చిన సంగతి తెలిసిందే. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డులుగా వాటిని పిలుస్తున్నారు. ఆ మేరకు అసెంబ్లీలో తీర్మానం ఆమోదించారు. అలా మార్చిన తరువాత సిబ్బందికి నిజంగా మంచి వార్తనే ఏపీలోని కూటమి ప్రభుత్వం వినిపిస్తోంది. రానున్న రోజులలో స్వర్ణ గ్రామం, వార్డు కార్యాలయాల ఉద్యోగులందరికీ ప్రమోషన్లు కల్పిస్తామని ప్రభుత్వం చెబుతోంది. దాదాపుగా ఆరేళ్ళ నుంచి ఒకే పోస్టులో ఎదుగూ బొదుగూ లేని జీవితంతో గడుపుతున్న స్వర్ణ గ్రామం.. స్వర్ణ వార్డు సిబ్బందికి నిజంగా ఇది తీపి వార్త అని అంటున్నారు.

**పనితీరు ప్రతిభతో :** స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాలలో పనిచే సిబ్బంది పనితీరు ప్రతిభను ఆధారంగా చేసుకుని ప్రమోషన్లు కల్పిస్తామని ప్రభుత్వం చెబుతోంది. అంతే కాదు ఈ వ్యవస్థ ద్వారా మరింత చేరువగా ప్రజలకు సేవలు అందేలా చూస్తున్నామని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి చెప్పారు. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల ద్వారా స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేస్తున్నామని ఆయన చెప్పారు.

**బిల్లుకు ఆమోదం :** ఇదిలా ఉంటే ఇప్పటిదాకా గ్రామ, వార్డు సచివాలయాలుగా ఉన్న ఈ వ్యవస్థ పేరుని కూటమి ప్రభుత్వం మార్పు చేసింది. దాంతో ఇక నుంచి స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాలుగా పిలవాలి. ఆ మేరకు పేరు మార్పు బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లు ఆమోదం సందర్భంగా శాసనమండలిలో మాట్లాడిన మంత్రి స్వామి స్వర్ణ గ్రామం, వార్డు కార్యాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని చెప్పారు. స్వర్ణ గ్రామం, వార్డు కార్యాలయాల్లో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

**మూడంచెల వ్యవస్థగా :** అదే విధంగా స్వర్ణ గ్రామం, వార్డు కార్యాలయాలపై పర్యవేక్షణ కోసం మూడంచెల వ్యవస్థ తీసుకొచ్చామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో లోప భూయిష్టంగా ఉన్న వ్యవస్థను కూటమి ప్రభుత్వంలో పటిష్టంగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి చెప్పడం విశేషం. అదే విధంగా కూటమి పాలనలో పంచాయతీ వ్యవస్థను



బలోపేతం చేస్తున్నామని అన్నారు. పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు ఇచ్చామని ఆయన గుర్తు చేశారు. అదే వైసిపి హయాంలో పంచాయతీ నిధులను దారిమల్లించారని విమర్శించారు.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## హైదరాబాద్‌లో కల్తీ నెయ్యి కలకలం

### తయారీ కేంద్రంలో సోదాలు.. 460 కిలోల స్వాధీనం



**మెహిదీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరా బాద్‌లో కల్తీ నెయ్యి తయారు చేస్తున్న స్థావరంలో బుధవారం నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోదాలు నిర్వహించారు. మీగడ, పామాయిల్, ప్రమాద కరమైన రసాయనాలతో తయారు చేసిన 460 కిలోల నెయ్యిని స్వాధీనం చేసుకొని, నిర్వాహకుడు జునైద్ హుస్సేన్ (26)ను అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్ భోలానగర్‌కు చెందిన జునైద్ ఫ్రైడ్ డెయిరీ పేరుతో అనుమతి తీసుకొని ఇంటినే అడ్డాగా మార్చుకున్నాడు. ఆవు, గేదె పాల నుంచి మీగడ సేకరించి దానిలో పామాయిల్, వనస్పతిలను కలిపేవాడు. నెయ్యిలా వాసన వచ్చేందుకు రసాయనాలను ఉపయోగించేవాడు. వీటిని ప్యాకెట్లుగా మార్చి నాణ్యమైన నెయ్యిగా చెబుతూ తక్కువ ధరకు హోటళ్లు, శుభకార్యాలకు భారీఎత్తున విక్రయించేవాడు. కొద్దినెలలుగా సాగుతున్న ఈ కల్తీపై టాస్క్‌ఫోర్స్ డీసీపీ అందె శ్రీనివాసరావుకు సమాచారం అందింది. ఆయన నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్, ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు విజయానంద్, చందన, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. రూ.18.26 లక్షల విలువైన 460 కిలోల కల్తీ నెయ్యి, 70 కేజీల కల్తీ మిశ్రమం, దాదాపు 3,260 కేజీల మీగడ, 28 డబ్బాల వనస్పతి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బెలూన్ ఊదుతుండగా.. గొంతులో ఇరుక్కొని నాలుగేళ్ల చిన్నారి మృతి



**పెదకాకాని, విశ్వం వాయిస్ న్యూస్ :** బెలూన్ ఊదుతూ ఆడుకుంటుండగా అది అనుకోకుండా గొంతులో ఇరుక్కోవడంతో ఓ చిన్నారి మృతిచెందింది. ఈ విషాద ఘటన గుంటూరు జిల్లాలో చోటుచేసుకొంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. పెదకాకానికి చెందిన మంజుల శ్రీనివాసరావు, వెంకటరమణ దంపతులకు నలుగురు ఆడపిల్లలు. కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇద్దరు కుమార్తెలు స్థానిక పాఠశాలలో చదువుతుండగా మూడో కుమార్తె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తుంది. చిన్న కుమార్తె శిరీష(4) ఇంటి దగ్గర తల్లితోనే ఉంటుంది. బుధవారం ఉదయం ఆమె తన అక్కతో కలిసి ఇంటికి సమీపంలోని దుకాణానికి వెళ్లి బెలూన్లు కొనుక్కొంది. ఈ క్రమంలో శిరీష బెలూన్ ఊదుతుండగా గొంతులో ఇరుక్కుపోయింది. శ్వాస ఆడక చిన్నారి ఏడుస్తుంటే కుటుంబ సభ్యులు గమనించి జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమార్తె చనిపోవడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

## బోధనేతర సిబ్బందిపై పదో తరగతి విద్యార్థి దాడి

### సిగరెట్లు తాగుతున్నాడని మందలించినందుకు దాష్టీకం

**హనుమాన్‌జంక్షన్, విశ్వం వాయిస్ న్యూస్ :** పాఠశాల ఆవరణలో సిగరెట్లు తాగుతున్నాడని మందలించినందుకు ఓ విద్యార్థి.. బోధనేతర సిబ్బందిపై దాడికి పాల్పడ్డాడు. వారం క్రితం జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం వీరవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత నెల 26న మధ్యాహ్న భోజన విరామ సమయంలో ముగ్గురు విద్యార్థులు మరుగుదొడ్ల వద్ద సిగరెట్లు తాగుతున్నారు. వీరిని గమనించిన ల్యాబ్ అసిస్టెంట్ రవీంద్ర విద్యార్థులను మందలించి ప్రధానోపాధ్యాయురాలికి, ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై తరగతి గదిలో విద్యార్థులను ప్రశ్నించారు. అంతలోనే ఓ విద్యార్థి.. రవీంద్రపై దాడి చేశాడు. అతడ్ని వారిస్తూ వీడియో తీసిన రికార్డు అసిస్టెంట్ రవిపై కూడా దుర్భాషలాడాడు. దీంతో బోధనేతర సిబ్బంది అదే రోజు పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులపై ఫిర్యాదు చేశారు. ఈ దాడికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో విద్యాశాఖ విచారణ చేపట్టింది. డీవైఈవో, ఎంఈవోల ఆధ్వర్యంలోని బృందం బుధవారం పాఠశాలకు వచ్చి వివరాలు సేకరించింది. నివేదికను డీఈవోకు అందిస్తామని అధికారులు తెలిపారు.

## ప్రాణాలు తీసిన అతివేగం

- లారీని ఢీకొన్న కారు.. ఐదుగురి దుర్మరణం
- మృతులది ఒకే కుటుంబం
- లారీ కిందకు దూసుకెళ్లిన కారును క్రేన్ సాయంతో బయటకు తీస్తున్న పోలీసులు



**పలమనేరు, గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అతివేగం వారి ప్రాణాలను బలితీసుకుంది. చిత్తూరు జిల్లా గంగవరం మండలం వైఎస్సార్ కూడలి వద్ద బైపాస్ మార్గంలో లారీని కారు ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం చెందారు. బుధవారం ఉదయం చిత్తూరు వైపు వెళ్తున్న లారీని వెనుక నుంచి వచ్చిన కారు 130 కి.మీ. వేగంతో ఢీకొట్టింది. దాంతో వాహనం లారీ కింది భాగంలో ఇరుక్కుపోయింది. కారులో ప్రయాణిస్తున్న బెంగళూరులోని రాజాజీనగర్‌కు చెందిన మోహన్‌దాస్(71), ఆయన భార్య కుసుమ (61), కుసుమ సోదరి జయంతి (59), ఆమె భర్త నాగరాజరావు (61) అక్కడికక్కడే మృతి చెందారు. నాగరాజరావు, జయంతిల కుమార్తె పూజ (33) సైతం ఘటనాస్థలిలోనే దుర్మరణం చెందారు. మృతదేహాలను కారులోంచి తీయడానికి పోలీసులు శ్రమ పడాల్సి వచ్చింది. ప్రమాదం జరిగినప్పుడు మోహన్‌దాస్ డ్రైవింగ్ చేస్తున్నారు. వీరు బెంగళూరు నుంచి తిరుమలకు వస్తుండగా ఈ ఘటన జరిగింది.

## అప్పు తీర్చమంటే.. ఆయువు తీశాడు

### నాటు తుపాకీతో యువకుడి కాల్చివేత



**చిత్తూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** స్నేహితుడికి అప్పు ఇచ్చి.. తిరిగి చెల్లించాలని అడగమే ఆ యువకుడి ప్రాణం పోయేలా చేసింది. చిత్తూరు మండలం తుమ్మిందపాళ్యం గ్రామానికి చెందిన మునియప్ప కుమారుడు డిల్లీబాబు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా.. అదే ప్రాంతానికి చెందిన మురుగేష్ కుమారుడు సాయికుమార్(25) సెంట్రింగ్ పని చేసేవారు. ఇద్దరూ బంధువులు, స్నేహితులు కూడా. కొన్ని నెలల కిందట సాయికుమార్ నుంచి డిల్లీబాబు రూ.2 లక్షల అప్పు తీసుకున్నాడు. వాటిని తిరిగి చెల్లించకపోవడంతో సాయికుమార్ అడుగుతూ వస్తున్నారు. బుధవారం అప్పు తీర్చాలని ఒత్తిడి చేయడంతో ఇద్దరి మధ్య మాటలు పెరిగాయి. ఈ క్రమంలో ఆవేశానికి గురైన డిల్లీబాబు నాటు తుపాకీ తీసుకొచ్చి సాయికుమార్ ముఖంపై గురిపెట్టి కాల్చాడు. బాధితుడు అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. చిత్తూరు తాలూకా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. వేట కోసమని తమిళనాడులో నాటు తుపాకీని కొనుగోలు చేసినట్లు తెలిసింది.

## హైదరాబాద్‌లో ప్రమాదం..

### భవనంపై నుంచి పడి ముగ్గురి మృతి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ టోలీచౌక్‌లో ప్రమాదం చోటు చేసుకుంది. నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి జారిపడి ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. భవనం ఐదో అంతస్తు నుంచి పడినట్లు స్థానికులు చెబుతున్నారు. ఘటనాస్థలిలోనే ముగ్గురు మృతి చెందగా.. మరో ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. వారిని దగ్గర్లోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కిసాన్ వాయిస్

## నమో డ్రోన్ దీదీ స్కీమ్ గురించి తెలుసా?

### మహిళా స్వయం సహాయక సంఘాలకు డ్రోన్ల పంపిణీతో సేద్యానికి టెక్నాలజీ దన్ను
### వ్యవసాయ ఉత్పాదకత పెంపుదలకు, జీవనోపాధి మెరుగుదలకు దోహదం

గత రెండు దశాబ్దాల్లో డ్రోన్ సాంకేతికత ప్రపంచవ్యాప్తంగా ఒక శక్తిమంతమైన సాధనంగా ఎదిగింది. మన దేశం కూడా ఈ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తోంది. వ్యవసాయం, పాలన, అభివృద్ధి రంగాల్లో డ్రోన్ల వినియోగాన్ని వేగంగా విస్తరిస్తోంది. తొలుత ప్రయోగాత్మకంగా డ్రోన్ల వాడకం చిన్నగా ప్రారంభమైనా ఇప్పుడు ప్రభుత్వ సేవలు, మౌలిక సదుపాయాల నిర్వహణ, వ్యవసాయం, జాతీయ భద్రత వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చే స్థాయికి చేరుకుంది. నమో డ్రోన్ దీదీ కార్యక్రమం కింద 1,094 డ్రోన్‌లను మహిళా స్వయం సహాయక సంఘాలకు అందించారు. ఇది వ్యవసాయ ఉత్పాదకతను, జీవనోపాధిని మెరుగుపరుస్తోంది. న్యూఢిల్లీలో ఏఐ సమ్మిట్ జరుగుతున్న సందర్భంగా డ్రోన్ల హవాపై ఫోకస్...

మన దేశంలో ప్రస్తుతం ఆధునిక వ్యవసాయంతో పాటు భూమి, ఆస్తి సర్వేలు, మౌలిక సదుపాయాల తనిఖీ, విపత్తు నిర్వహణ, రైల్వే, హైవేల పర్యవేక్షణ వంటి పనుల కోసం డ్రోన్లను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. డ్రోన్ల తయారీదారులు, సాఫ్ట్‌వేర్ డెవలపర్లు, శిక్షణ సంస్థలు, అంకుర సంస్థలు, పరిశోధన సంస్థలు, ధ్రువీకృత పైలట్‌ల కృషితో డ్రోన్ల వినియోగం ప్రభుత్వ నిబంధనలకు లోబడి నానాటికీ విస్తరిస్తోంది. కేంద్ర ప్రభుత్వ తాజా గణాంకాల ప్రకారం.. ఫిబ్రవరి 2026 నాటికి దేశంలో 38,500కు పైగా నమోదిత డ్రోన్‌లు(యూఐఎన్) వాడుకలో ఉన్నాయి. 39,890 డీజీసీఏ-ధ్రువీకృత పైలట్లు సేవలందిస్తున్నారు. 244 శిక్షణా సంస్థలు డ్రోన్ సంబంధిత నైపుణ్యాలను అందిస్తున్నాయి. స్వమిత్వ పథకం కింద డ్రోన్‌లను ఉపయోగించి 3.28 లక్షల గ్రామాలను సర్వే చేశారు. 31 రాష్ట్రాల్లోని 1.82 లక్షల గ్రామాలకు సంబంధించి 2.76 కోట్ల ఆస్తి కార్డులను రూపొందించారు. సరళీకృత విధాన నిర్ణయాలు డ్రోన్ వ్యవస్థ విస్తరణకు దోహదపడుతున్నాయి. ప్రభుత్వం తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాల వల్ల ఈ రంగం ఇంతగా అభివృద్ధి చెందింది. సరళీకృతమైన డ్రోన్ నియమాలు, 'డిజిటల్ స్కై' సింగిల్ విండో ప్లాట్‌ఫారమ్, తయారీదారులకు ఇచ్చే ప్రోత్సాహకాలు, లక్షిత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, డ్రోన్ వినియోగాన్ని సామాన్యులకు కూడా అందుబాటులోకి తీసుకువచ్చాయి. ప్రభుత్వ పథకాల్లో డ్రోన్‌లను చేర్చడం వల్ల పనులు మరింత వేగంగా, పారదర్శకగా జరుగుతున్నాయి.

### నమో డ్రోన్ దీదీ సేవలు

నవంబర్ 2023లో ప్రారంభించిన 'నమో డ్రోన్ దీదీ' కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం. ఆధునిక వ్యవసాయ పద్ధతులకు మద్దతుగా మహిళా స్వయం సహాయక సంఘాలకు(ఎస్‌హెచ్‌జీ) డ్రోన్లను అందించడం ఈ పథకం లక్ష్యం. వ్యవసాయ సామర్థ్యాన్ని మెరుగుపరచడం, పంట ఉత్పాదకతను పెంచడం, పెట్టుబడి ఖర్చులను తగ్గించడం, మహిళలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలను కల్పించడం దీని ప్రధాన ఉద్దేశ్యాలు. డ్రోన్ దీదీ పథకం ప్రారంభమైనప్పటి నుంచి ప్రముఖ ఎరువుల కంపెనీల ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలకు 1,094 డ్రోన్లు పంపిణీ అయ్యాయని గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో నమో డ్రోన్ దీదీ పథకం కింద అందించినవి 500కు పైగా డ్రోన్లు ఉన్నాయి. నమో డ్రోన్ దీదీ పథకం శ్రమతో కూడిన పాత పిచికారీ పద్ధతులకు స్వస్తి చెప్పి.. కచ్చితమైన ఫలితాలు సాధించే కృషి దిశగా వ్యవసాయంలో గణనీయమైన మార్పునకు శ్రీకారం చుట్టింది. ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్‌కు చెందిన ఒక డ్రోన్




దీదీ మాట్లాడుతూ డ్రోన్ శిక్షణ తనను శక్తివంతం చేసిందన్నారు. స్వయం సహాయక సంఘం తరఫున నానో ఎరువులు, పురుగు మందుల పిచికారీ సేవలను అందిస్తూ ఆదాయం పొందుతున్నానని వివరించారు.

### డ్రోన్ల నిబంధనలు మీకు తెలుసా?

దేశంలో డ్రోన్ల వినియోగం వేగవంతంగా విస్తరిస్తోంది. డ్రోన్ల తయారీ, వినియోగాన్ని వేగవంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం సమగ్ర విధానపరమైన, ఆర్థిక చట్రాన్ని ఏర్పాటు చేసింది. ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, నిబంధనల అమలును సులభతరం చేయడానికి, స్వదేశీ డ్రోన్ల ఉత్పత్తిని బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంది.

డ్రోన్ రూల్స్ 2021ను 2022, 2023లలో సవరించారు. ఈ సవరణలు మన దేశ డ్రోన్ వ్యవస్థను సరళీకరించాయి.

నియంత్రణ విధానాలు సులభతరమయ్యాయి. ఫారమ్‌ల సంఖ్యను 25 నుంచి 5కి తగ్గించారు. అనుమతుల అవసరాలను 72 నుంచి కేవలం 4కు తగ్గించారు.

ఫీజుల హేతుబద్ధీకరణ జరిగింది. డ్రోన్ పరిమాణంతో సంబంధం లేకుండా ఫీజుల నిర్ణయం జరిగింది.

పౌర డ్రోన్ కార్యకలాపాల్లో 500 కేజీల బరువు వరకు ఉన్న డ్రోన్ల వాడకానికి అనుమతి లభించటంతో వాణిజ్య, పారిశ్రామిక అవసరాల కోసం వినియోగం పెరిగింది.

గగనతలంలో దాదాపు 90%ను గ్రీన్ జోన్‌గా ప్రకటించారు. 400 అడుగుల ఎత్తు వరకు డ్రోన్లను ప్రభుత్వం అనుమతిస్తున్నది.

'సాంప్రదాయ పైలట్ లైసెన్స్‌కు బదులుగా డీజీసీఏ జారీ చేసే 'రిమోట్ పైలట్ సర్టిఫికేట్'ను ప్రవేశపెట్టారు.

పాస్‌పోర్ట్ అవసరం లేదు. ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా ఐడీ, అడ్రస్ ప్రూఫ్ ఉంటే డ్రోన్లను నడపడానికి సరిపోతుంది.

మొత్తంగా ఈ సంస్కరణలు డ్రోన్ రంగంలోకి ప్రవేశించాలనుకునే వారికి గల అడ్డంకులను గణనీయంగా తగ్గించాయి. డ్రోన్ సేవల అందుబాటును గ్రామాల్లో పెంచడానికి దోహదపడుతున్నాయని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది.

డ్రోన్లు, డ్రోన్ విడిభాగాల దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించటానికి పీఎల్ఐ పథకానికి కేంద్రం రూ.120 కోట్లు కేటాయించింది. అంకుర సంస్థలు, ఎంఎస్ఎంఈలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడానికి, దేశీయ డ్రోన్ తయారీ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఈ పథకం వీలు కల్పిస్తోంది.

సెప్టెంబర్ 2025లో డ్రోన్లపై జీఎస్టీని ఏకరీతిగా 5 శాతానికి తగ్గించారు. అంతకుముందు 18%, 28% పన్ను రేట్లు ఉండేవి.

డ్రోన్ రిజిస్ట్రేషన్, రిమోట్ పైలట్ సర్టిఫికేషన్, టైప్ సర్టిఫికేషన్, ఆర్టీపీఓ అధికారాల వంటి నియంత్రణ సేవలు డిజిటల్ స్కై ప్లాట్‌ఫారమ్ నుంచి ఈజీసీఏకి మార్చారు. విమాన ప్రణాళిక, ఎయిర్‌స్పేస్ మ్యాప్ వంటి కార్యాచరణ సేవలు డిజిటల్ స్కై ప్లాట్‌ఫారమ్‌తో అనుసంధానితమై కొనసాగుతున్నాయి. మన దేశంలో డ్రోన్ వ్యవస్థ పైలట్ ప్రాజెక్టుల స్థాయి నుంచి ఆవిష్కరణ--ఆధారిత ప్రధాన స్రవంతి రంగంగా ఎదిగింది. మహిళా సాధికారత, గ్రామీణ సదుపాయాలు, దేశీయ తయారీకి మద్దతు ఇచ్చే కార్యక్రమాలతో ప్రభుత్వం సాంకేతిక ఆవిష్కరణలను, విస్తృత డ్రోన్ల వినియోగాన్ని ప్రోత్సహిస్తోంది. డ్రోన్లు ఇప్పుడు వ్యవసాయం, భూమి, ఆస్తి సర్వేలు, మౌలిక సదుపాయాల పర్యవేక్షణ, విపత్తు అంచనా, పౌర సేవల పంపిణీ వంటి కీలక రంగాలలో భాగమయ్యాయి.

### పంట నష్టాల సేకరణ సులువు

దేశంలో అనేక రంగాల్లో డ్రోన్లు వివిధ రంగాలలో సామాజిక--ఆర్థిక అభివృద్ధి ఫలితాలను అందిస్తున్నాయి. వ్యవసాయంలో వీటి వినియోగం మహిళా రైతులకు సాధికారత కల్పించడమే కాకుండా పంట నష్టాల అంచనా పనులను మెరుగుపరిచింది. మౌలిక సదుపాయాలు, పట్టణ ప్రణాళికలో ఇవి చురుకైన పర్యవేక్షణ, మెరుగైన వనరుల నిర్వహణకు వీలు కల్పించాయి.

### పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం

# రైతులకు నష్టపరిహారాన్ని అందించాలి

## సీఎం చంద్రబాబుకు వినతి పత్రాన్ని అందించిన రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రూడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి మర్యాదపూర్వకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అమరావతి సచివాలయంలో సియం కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి రాజానగరం నియోజకవర్గం పలు అభివృద్ధి కార్యక్రమాలపై మరియు పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా రైతులకు ఎదురైన నష్టపరిహారం కోసం వినతి పత్రాన్ని అందజేయడం జరిగిందని రుడా చైర్మన్ బొడ్డు ఓ ప్రకటనలో విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా బొడ్డు వెంకటరమణ చౌదరి తెలియజేస్తూ పురుషోత్తపట్నం పుష్కర ఎత్తిపోతల పథకం కోసం రాజానగరం నియోజకవర్గ సీతానగరం మండలంలోని పురుషోత్తపట్నం, చినకొండేపూడి, నాగంపల్లి గ్రామాల రైతులు భూములు ఇచ్చారని వారిలో 92 మంది రైతులకు న్యాయమైన పరిహారం మాత్రం అందలేదని వారు ఆవేదన చెందుతున్నారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందని ఆయన అన్నారు. పురుషోత్తపట్నం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం కారణంగా ఈ రైతులు తమ భూములను కోల్పోయారనీ ఇప్పటికీ సరైన పరిహారం అందక న్యాయం కోసం ఎదురు చూస్తున్నారనీ నాగంపల్లి,వంగలపూడి మరియు పురుషోత్తపట్నం గ్రామాల్లోని 321 మంది రైతుల నుండి మొత్తం 203.6925 ఎకరాల భూమిని సేకరించారని వారిలో 92 మంది రైతులకు నష్టం పరిహారం ఇంకా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని వివరించడం జరిగిందన్నారు. ప్రభుత్వం తమకు నిర్ణయించిన పరిహారం మార్కెట్ ధర కంటే చాలా తక్కువగా ఉందని చాలా మంది రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారనీ వీరిలో చిన్న మరియు సన్నకారు రైతులుగా, తమ భూములను కోల్పోవడం వల్ల కలిగే ఆర్థిక భారం చాలా తీవ్రంగా ఉందని దీని వలన వారు తమ కుటుంబాలను పోషించుకోవడం చాలా కష్టతరంగా మారిందని రైతులు వాపోతున్నారని సియంకు వివరించడం జరిగిందని అన్నారు. 92 మంది రైతుల నుంచి సేకరించిన 75 ఎకరాల భూమికి పరిహారం అందలేదని వీరిని తక్షణమే ఆదుకోవాలని కోరడం జరిగిందని అన్నారు. అలాగే రాజానగరం నియోజకవర్గంలో కొన్ని ముఖ్యమైన రోడ్లను అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారని కీలకమైన రోడ్లన్నీ అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కు అందించిన వినతులపై సానుకూలంగా స్పందించారని తక్షణమే సమస్యలను పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నారని బొడ్డు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఓబులనేని కృష్ణ చైతన్య, గుర్రం ఉదయభాస్కర్, ముళ్ళపూడి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

### కమ్మేసిన పొగమంచు...

# వేసవికి స్వాగత సంకేతమేనా.!

## ఉదయం 7, 8 గంటలకూ వీడని మంచు, ఆచితూచి ముందుకు సాగిన వాహనదారులు

## వెన్నెల విందుతో మురిసిన ప్రజానీకం





**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలో దట్టమైన పొగమంచు మేఘం లా గురువారం ఉదయం 7,8 గంటల సమయంలో కమ్ముకోవడంతో రహదారులపై ప్రయాణం చేసే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దూరం స్పష్టంగా కనిపించకపోవడంతో వాహనాలు హెడ్ లైట్ల సహాయంతో నెమ్మదిగా సాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. శీతాకాలం ముగింపు దశలో ఉండటంతో ఈ తరహా పొగమంచు కనిపించడం సహజమేనని పలువురు చెబుతుండగా, ఉదయం వేళల్లో చల్లని గాలులతో పాటు మంచు కురవడం వల్ల పరిసరాలు మబ్బులతో కప్పుకున్నట్లుగా కనిపించాయి. రహదారులు, చెట్లు, విద్యుత్ తీగలు అన్నీ మంచు ముసుగులో మాయమైపోయినట్లుగా కనిపిస్తు స్థానికులకు వెన్నెల విందు చేసింది. ఇటీవల కాలంలో రాత్రివేళల్లో చల్లదనం పెరగడం, ఉదయం సమయంలో పొగమంచు పడటం జరుగుతుందని గ్రామస్థులు పేర్కొన్నారు. శీతాకాలం ముగింపు దశలో ఉండటంతో ప్రకృతి ఇలా మారుతూ వేసవి కాలానికి స్వాగతం పలుకుతున్నట్లుగా ఉందని అభిప్రాయపడుతున్నారు. పొగమంచు కారణంగా ఉదయం వేళల్లో వాహనదారులు హెడ్‌లైట్లు వేసుకుని జాగ్రత్తగా ప్రయాణించాలని అధికారులు సూచిస్తున్నారు.

### వాకర్స్ యోగ & లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో

# మహిళా దినోత్సవం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వాకర్స్ యోగ అండ్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్కేవిటి డిగ్రీ కళాశాలలోని ఆనంద గార్డెన్స్ లో క్లబ్ అధ్యక్షులు శనపతి సత్తిబాబు అధ్యక్షతన మహిళా దినోత్సవ వేడుకలు మరియు వృద్ధులకు పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి జిఎస్ఎల్ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కే. ఎం. లావణ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వి వెంకటలక్ష్మి, ఆధ్యాత్మికవేత్త కే స్వర్ణశ్రీ,విజయలక్ష్మి, గీతక్క హాజరయ్యారు. క్లబ్ కార్యదర్శి గుబ్బల గంగాభవాని అతిధులను సభకు పరిచయం చేశారు. తమ తమ రంగాల్లో సమాజానికి విశిష్ట సేవలందిస్తున్న అతిథులను క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. క్రమం తప్పకుండా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వాకర్స్ యోగ లాఫింగ్ క్లబ్ కు తమ వంతు సహకారం అందిస్తామని అతిథులు అన్నారు. ఈ సందర్భంగా 80 మంది వృద్ధులకు రూ. 500 చొప్పున 40,000 అతిథుల చేతుల మీదుగా పింఛన్లను పంపిణీ చేశారు. క్లబ్ కార్యదర్శి గుబ్బల గంగాభవాని ఆధ్యర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.వృద్ధులకు కేఎల్ సుశీల అల్పాహారం ఏర్పాటు చేయగా డీఎన్ కళావతి, సుశీల పాత దుస్తులను పంపిణీ చేశారు.పి నాగవేణి అరటిపండ్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయగా క్లబ్ సెక్రటరీ బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బేరి రత్నం,లంక శ్రీదేవి, ఉప్పులూరి కాశీ విశ్వనాథం, గేసాల బాపూజీ, మావూరి రామకృష్ణ, శీలం రామకృష్ణ, పామర్తి గోపాలరావు తదిరులు పాల్గొన్నారు.

# గుప్త చిట్స్ అండ్ ఫైనాన్స్‌లో మోసపోయాం

## చిట్ ఫండ్ బృందంపై కేసులు పెట్టిన చర్యలు శూన్యం

## తమకు న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తపరిచిన బాధితులు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట మండలం తాపేశ్వరంలో గుప్త చిట్స్ అండ్ ఫైనాన్స్ పేరిట 13 మందితో కూడిన సభ్యుల బృందం డిపాజిట్లు సేకరించి తమను మోసం చేశారని బాధితులు ఆవేదన వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా బాధితులు స్థానిక సూర్య కన్వెన్షన్ హాల్ నందు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో గ్రంధి సూర్య వెంకట ప్రకాశరావు మాట్లాడుతూ గుప్తా చిట్స్ అండ్ ఫైనాన్స్ బృందం తమ వద్ద చిట్స్ రూపన డబ్బులు వసూలు చేసి తిరిగి తమకు చెల్లించకపోవడంపై రాష్ట్ర డిజిపి కి ఫిర్యాదు చేయడం జరిగిందని వారు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ కి చిట్స్ అండ్ ఫైనాన్స్ వారిపై డిపాజిట్ యాక్ట్ కేసును నమోదు చేయాలని ఆదేశాలు ఇచ్చారని మండపేట రూరల్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసినప్పటికి కూడా వారిపై చర్యలు శూన్యమని అన్నారు. గుప్త చిట్స్ అండ్ ఫైనాన్స్ బృందంలో పరారీలో ఉన్న చక్కా వీరవెంకట సతీష్, సూర్యకళ లను విజయవాడ సమీపంలోని పోరంగిలో ఉన్నటు గుర్తించి బాధితులమైన మేము పట్టుకోని పెనమలూరు పోలీస్ స్టేషన్లో అప్పగించమన్నారు. ఇదంతా బాధితులైన తామే చేసాము తప్ప పోలీసులు ఏమి చేయలేదన్నారు. మిగిలిన 11 మంది సభ్యులు మండపేటలో యదేచ్ఛగా తిరుగుతున్నారని వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తపరిచారు. రూరల్ పోలీస్ స్టేషన్లో డిపాజిట్ యాక్ట్ చట్టం కింద కేసు నమోదు చేశారని 3నెలలైనా ఇప్పటికీ ఎవరినీ అదుపులోకి తీసుకోలేదన్నారు. సుమారు రూ.8కోట్లు మేర నష్టపోయినట్లు తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు 90 రోజుల్లో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలన్న ఆదేశాలను సైతం నిరుగార్చారని అన్నారు. ఇప్పటికైనా పోలీసు వారు తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మద్దుల ఆనంద్, మాజేటి లక్ష్మీ నారాయణ, పడాల కమాలా రెడ్డి, చక్కా వీరన్న, చక్కా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేతల సమస్యలు పరిష్కరించాలి

## చేనేత మంత్రిని కలిసిన ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట నియోజకవర్గం లోని చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు రాష్ట్ర బి.సి సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవితను కోరారు. గురువారం అమరావతిలో మంత్రిని మర్యాదపూర్వ కంగా కలిసి నియోజకవర్గంలోని చేనేతల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులకు రావలసిన పావలా వడ్డీ, రిబేటు, త్రిఫ్ట్ ఫండ్, ఇతర బకాయిలు చెల్లించడంతో పాటు ఉచిత విద్యుత్ అంశంపై మంత్రితో చర్చించారు. చేనేతలకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వీలైనంత త్వరగా విడుదల చేసి వారిని ఆదుకోవాలని ఎమ్మెల్యే వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బి. జయ నాగేశ్వరరెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్.పి. సోడియా, ఐఏఎస్, చేనేత శాఖ కమిషనర్ జి. రేఖారాణి, ఐఏఎస్ తదితరులు పాల్గొన్నారు.

### సీతపల్లి గడి బాపనమ్మ తల్లి

# జాతర మహోత్సవాలు పోస్టర్ విడుదల

## జాతర మహోత్సవాలకు ఎమ్మెల్యే శిరీషాదేవి రూ.1,00,000/-లు విరాళం




**రంపచోడవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సంప్రదాయ బద్ద పండుగలే దేశ సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలుగా ఉంటాయని రంపచోడవరం ఎమ్మెల్యే రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. రంపచోడవరం మండలం సీతపల్లి శ్రీ గడి బాపనమ్మ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 14 నుండి 18 వ తేది వరకు ఉగాది శుభాకాంక్షలతో జాతర మహోత్సవాలు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా అత్యంత పురాతన ప్రాచుర్యం పొందిన సీతపల్లి గడి బాపనమ్మ తల్లి దేవస్తానం అన్నారు. ఆయా తేదీల్లో నిర్వహించే పలు సాంస్కృతిక కార్యక్రమాలకు తన వంతుగా రూ:1,00,000/- లు విరాళంగా అందజేశారు. అలాగే ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని సిబ్బందికి హామీ ఇచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అత్యంత పారదర్శకంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీ గడి బాపనమ్మ అమ్మవారి చైర్మన్ కుంజం బాపన్న దొర, ఆలయ డైరెక్టర్ సత్య సుందర్ రావు, భాను సప్లై కంపెనీ అధినేత బత్తిన శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు బత్తిన రామ కోటేశ్వరరావు, ఆలయ కార్య నిర్వహణ అధికారి సచ్చే రమేష్ పాల్గొన్నారు.

# పదవ తరగతి హాల్ టికెట్లు విడుదల

## మార్చి 16 నుంచి పరీక్షలు - ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ సౌకర్యం - అనధికారిక లింకులను నమ్మవద్దు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పదో తరగతి విద్యార్థులకు కీలక సమాచారం విడుదలైంది. రాష్ట్రంలో మార్చి 16 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను నేడు ఉదయం 11 గంటలకు విడుదల చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు కె.వి. శ్రీనివాసులురెడ్డి వెల్లడించారు. పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు నేటి నుంచే తమ హాల్ టికెట్లను పొందవచ్చని తెలిపారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను మాధ్యమిక విద్యామండలి అధికారిక అంతర్జాల వేదిక ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. అలాగే సాంకేతికతను మరింత అందుబాటులోకి తీసుకువస్తూ ఈసారి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. "మన మిత్ర" వాట్సాప్ నంబర్ 95523 00009కు సందేశం పంపడం ద్వారా లేదా పాఠశాల విద్యాశాఖకు చెందిన లీప్ అనువర్తనం ద్వారా కూడా హాల్ టికెట్లు పొందే సౌకర్యాన్ని అందుబాటులో ఉంచారు. అధికారిక అంతర్జాల వేదికలో జిల్లా పేరు, పాఠశాల పేరు, విద్యార్థి పేరు మరియు పుట్టిన తేదీ వివరాలను నమోదు చేసి హాల్ టికెట్‌ను పొందవచ్చు. ఆ తరువాత హాల్ టికెట్‌ను ముద్రించుకుని పరీక్షలకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. విద్యార్థులు ముందుగానే తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు సూచించారు. హాల్ టికెట్ల జారీకి సంబంధించి ఎటువంటి ప్రైవేటు సంస్థలకు లేదా ఇతర అంతర్జాల వేదికలకు అనుమతి ఇవ్వలేదని అధికారులు స్పష్టం చేశారు. కేవలం అధికారిక మార్గాల ద్వారానే హాల్ టికెట్లు పొందాలని సూచించారు. హాల్ టికెట్‌లో ఏవైనా తప్పులు లేదా సందేహాలు ఉంటే వెంటనే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని విద్యార్థులు, తల్లిదండ్రులకు అధికారులు సూచించారు. పరీక్షలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ముందుగానే హాల్ టికెట్లు తీసుకుని సిద్ధంగా ఉండాలని కోరారు.



# డ్రైనేజీ సమస్యతో ముంపులో కోనసీమ

## అసెంబ్లీలో అంశాన్ని లేవనెత్తిన ఎమ్మెల్యే ఆనందరావు




**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రైతాంగాన్ని తీవ్రంగా ఇబ్బంది పెడుతున్న డ్రైనేజీ సమస్యపై అసెంబ్లీలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గళమెత్తారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని డ్రైనేజీ సమస్య కారణంగా వేలాది ఎకరాల పంటలు ముంపుకు గురవుతున్నాయని పేర్కొంటూ ఈ అంశాన్ని సభ దృష్టికి తీసుకువచ్చారు. కోనసీమ ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరంగా వివరించి తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీలో మాట్లాడిన ఆనందరావు, కోనసీమ జిల్లాకు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తు చేశారు. రాష్ట్రం నుంచి జరిగే సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో కోనసీమ జిల్లా వాటా సుమారు 35 శాతం ఉందని, దాదాపు రూ 5,000 కోట్ల విలువైన ఎగుమతులు ఈ ప్రాంతం నుంచి జరుగుతున్నాయని తెలిపారు. అలాంటి కీలకమైన ప్రాంతంలో డ్రైనేజీ సమస్యల కారణంగా పంటలు ముంపుకు గురవడం రైతులకు మాత్రమే కాదు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకూ నష్టం కలిగించే అంశమని స్పష్టం చేశారు. అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో విస్తరించి ఉన్న సుమారు 10,000 ఎకరాల స్వాంప్ (చిత్తడి నేల) ప్రాంతంలో దాదాపు 8,000 ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయని ఆయన వెల్లడించారు. ఈ ఆక్రమణల కారణంగా ఆ ప్రాంతంలోని 132 డ్రైన్ల ద్వారా సముద్రంలోకి వెళ్లాల్సిన నీరు వెళ్లకపోవడంతో పంట పొలాలు ముంపుకు గురవుతున్నాయని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా పని చేయకపోవడం వల్ల ప్రతి ఏడాది రైతులు భారీ నష్టాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా సముద్రంలోకి కలిసే చివరి 6 కిలోమీటర్ల డ్రైన్ ప్రాంతాన్ని ఇప్పటికీ అధికారికంగా నోటిఫై చేయకపోవడం కూడా ప్రధాన సమస్యగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఆ ప్రాంతం నోటిఫికేషన్‌లో లేకపోవడం వల్ల పూడికతీత వంటి పనులకు ప్రభుత్వ నిధులు అందకపోతున్నాయని తెలిపారు. దీంతో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా సక్రమంగా నిర్వహించబడక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆనందరావు డిమాండ్ చేశారు. స్వాంప్ ప్రాంతాన్ని అధికారికంగా నోటిఫై చేసి ఆక్రమణలను తొలగించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించి నీరు సముద్రంలోకి నిర్బంధం లేకుండా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కోనసీమలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు త్వరితగతిన పరిష్కారమవ్వాలని, భవిష్యత్తులో ఈ ప్రాంతంలో క్రాప్ హాలిడే అనే మాట వినిపించకుండా చేయడం తన లక్ష్యమని ఆనందరావు స్పష్టం చేశారు. రైతాంగం రక్షణ కోసం అసెంబ్లీలో తన వంతు పోరాటం కొనసాగుతుందని ఆయన తెలిపారు.

# ప్రజల చెంతకే పోలీసులు

## కోనసీమ జిల్లావ్యాప్తంగా ఘనంగా 'పల్లెనిద్ర' కార్యక్రమం

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**





డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పోలీస్ అధికారులు 'పల్లెనిద్ర' కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ప్రజలకు పోలీస్ యంత్రాంగాన్ని మరింత చేరువ చేయడం, క్షేత్రస్థాయిలో సమస్యలను నేరుగా తెలుసుకోవడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ పరిధిలో అధికారులు రాత్రి సమయంలో గ్రామాల్లో గడిపి స్థానిక ప్రజలతో మమేకమయ్యారు. గ్రామాల్లోని రచ్చబండల వద్ద సమావేశాలు నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు రక్షణగా ఉంటారని భరోసా ఇచ్చారు. పెరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీలు ఎవరికీ చెప్పకూడదని అవగాహన కల్పించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎలాంటి వేధింపులు ఎదురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ వారి భవిష్యత్తును కాపాడాలని కోరారు. అలాగే మితిమీరిన వేగం ప్రమాదకరమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై సోమేంద్ర తామరపల్లి గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ సురేంద్ర పలివెల గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల ముంగిటకే పాలనను తీసుకువెళ్లడం, నేరరహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

# ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి

## జాయింట్ కమిషనర్ సునీత

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ గోదావరి భవన్‌లో గురువారం పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, డ్వామా సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం సంయుక్త కమిషనర్ (కన్వర్జెన్సీ) జె.సునీత, చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి బి.గోపీచంద్ సమావేశానికి హాజరై జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఉపాధి హామీ అనుసంధానంతో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలోని 385 గ్రామపంచాయతీలలో నరేగా అనుసంధానంతో చేపట్టిన అభివృద్ధి మెటీరియల్ భాగం పనుల పురోగతిపై సమీక్షించారు. మొత్తం రూ. 48.21 కోట్ల మెటీరియల్ భాగం నిధులతో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మార్చి 15లోపు పనులను పూర్తి చేసి బిల్లులను ఆన్లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో 20 పనులకు మాత్రమే అనుమతి ఉన్నదని, అయితే ఉద్యానవన పనులు, గృహ నిర్మాణ పనులకు మినహాయింపు ఉన్నదని వివరించారు. ఉపాధి వేతనదారులందరూ తప్పనిసరిగా ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలని సూచించారు. అలాగే మార్చి 1 నుంచి పనులకు హాజరయ్యే వేతనదారుల హాజరు ముఖ ఆధారిత హాజరు విధానం ద్వారా నమోదు చేయడం తప్పనిసరి అయినందున హాజరు పంపే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని 22 మండలాల ఉపాధి కార్యక్రమాధికారులకు ఆదేశించారు. సాంకేతిక సమస్యలపై కూడా సమీక్ష నిర్వహించారు. పేదలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల్లో సుస్థిర ఆస్తులు సృష్టించే లక్ష్యంతో ఏప్రిల్ నుంచి అమలులోకి రానున్న వికసిత్ భారత్ జీ రామ్‌జీ పథకాన్ని నరేగా తరహాలో సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్. మధుసూదనరావు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ సూపరింటెండింగ్ ఇంజనీర్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. సమీక్షా సమావేశంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం డిప్యూటీ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, సహాయ ప్రాజెక్టు డైరెక్టర్లు, ఉపాధి కార్యక్రమాధికారులు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు మరియు జూనియర్ ఇంజనీర్లు హాజరయ్యారు.

# పల్లపు రావుకి అక్షయసేవ సంస్థ ఆర్థిక సహాయం



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఐ.పోలవరం మండలం ఎర్ర గరువు గ్రామానికి చెందిన నీతి పూడి పల్లపురావు ఇల్లు గ్యాస్ సిలిండర్ లీకై పేలిపోవడం వలన ఇల్లు మొత్తం కాలిపోయింది పల్లపు రావు కి కట్టుబట్టలు తప్ప ఇంకేమీ మిగలక తీవ్ర ఇబ్బందులలో ఉన్న ఆ కుటుంబానికి సహాయంకోసం గ్రామ పెద్దలు అక్షయ సేవా సంస్థ గురించి తెలుసుకుని సహాయం కోరగా పల్లపు రావు కి అక్షయ సేవా సంస్థ సభ్యుల చేతుల మీదుగా .10000. రూపాయలు ఇవ్వడం జరిగింది.దీనికి సహకరించిన సంస్థ సభ్యులందరికీ ధన్యవాదములు సంస్థ నుండి తెలియజేసారు.

## ఒంటిమిట్ట రాములోరికి

# ఈ భక్తుడు ఏం చేయించాడంటే..?






రెండో భద్రాద్రిగా పేరొందిన కడప జిల్లాలోని ఒంటిమిట్ట కోదండ రాముల వారి దేవాలయంకు ప్రముఖ పారిశ్రామికవేత్త ప్రతాపరెడ్డి భారీ విరాళం అందించారు. సీతారామ లక్ష్మణుల ఉత్సవ విగ్రహాల కోసం ప్రత్యేకంగా తయారు చేయించిన మూడు బంగారు కిరీటాలను ఆలయానికి సమర్పించారు. రెండో భద్రాద్రిగా ప్రసిద్ధి చెందిన కడప జిల్లా ఒంటిమిట్ట కోదండ రాముల వారి దేవాలయంకు ప్రముఖ పారిశ్రామికవేత్త ప్రతాపరెడ్డి భారీ విరాళం అందించారు. సీతారామ లక్ష్మణుల ఉత్సవ విగ్రహాల కోసం ప్రత్యేకంగా తయారు చేయించిన మూడు బంగారు కిరీటాలను ఆలయానికి సమర్పించారు. శ్రీరాముల వారి కళ్యాణోత్సవ వేళ ఆలయం ముస్తాబవుతున్న సమయంలో ఈ విరాళం అందజేయడం విశేషంగా నిలిచింది. కళ్యాణం సందర్భంగా ఉత్సవ విగ్రహాలు పురవీధుల్లో విహరిస్తాయి. ఆ విగ్రహాలకు అలంకరణగా ఉండేలా సీతాదేవి, శ్రీరాముడు, లక్ష్మణుడి కోసం మూడు కిరీటాలను ప్రత్యేకంగా రూపకల్పన చేశారు. వివరాల ప్రకారం.. సీతాదేవి విగ్రహానికి 750 గ్రాములు, శ్రీరాముల వారికి 670 గ్రాములు, లక్ష్మణుడికి 650 గ్రాముల బంగారంతో కిరీటాలు తయారు చేయించారు. మొత్తం కలిపి 2 కిలోల 70 గ్రాముల బరువున్న ఈ కిరీటాలలో సుమారు 164 గ్రాముల మేలిమి రత్నాలు పొదిగించారు. ఇదే కాక గతంలో మూలవిరాటుకు 6 కిలోల బంగారాన్ని కూడా ప్రతాపరెడ్డి బహుకరించారు. ఇప్పటివరకు ఆయన ఒంటిమిట్ట దేవాలయానికి మొత్తం 8.5 కిలోల బంగారాన్ని సమర్పించినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.య భక్తుని ఈ విశేష విరాళంతో ఒంటిమిట్ట ఆలయంలో కళ్యాణోత్సవ వేడుకలు మరింత వైభవంగా జరిగేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# మహిళల భద్రత సమాజ బాధ్యత

## కోనసీమ జిల్లాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు

## జిల్లా ఎస్పి రాహుల్ మీనా

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**




అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహిళా రక్షణ, సాధికారతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పాఠశాలల్లో విద్యార్థులకు మహిళల ఆత్మగౌరవం, భద్రతపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా మహిళా శక్తి, ధైర్యాన్ని ప్రతిబింబించేలా యువత మరియు వాలంటీర్లతో ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. కళారూపాల ద్వారా మహిళల సాధికారతపై సామాజిక చైతన్యం కలిగించే ప్రయత్నం చేశారు. అలాగే ఆపద సమయంలో మహిళలు తమను తాము ఎలా రక్షించుకోవాలి, శక్తి టీమ్స్ పనితీరు, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, 112 హెల్ప్‌లైన్ నంబర్ల ప్రాముఖ్యతపై అవగాహన వీడియోలను విద్యార్థులకు ప్రదర్శించారు. సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించిన మహిళల జీవిత గాథలను చూపించే స్ఫూర్తిదాయక లఘు చిత్రాలను కూడా ప్రదర్శించి విద్యార్థుల్లో ప్రేరణ నింపారు. మహిళల భద్రత కేవలం చట్టాలతోనే కాకుండా సామాజిక మార్పుతోనే సాధ్యమవుతుందని, ప్రతి విద్యార్థి మహిళల పట్ల గౌరవ భావాన్ని కలిగి ఉండాలని, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలని ఈ కార్యక్రమాల ద్వారా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక పోలీస్ అధికారులు, పాఠశాలల యాజమాన్యం, ఉపాధ్యాయులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# సరదా విదేశాలకు వెళ్లి వస్తుంటే.. ఏంటో అనుకున్నారు..

## అనుమానంతో ఆరా తీస్తే మైండ్ బ్లాక్..!



నెల్లూరులో చాలా రోజుల నుంచి బెట్టింగ్ మాఫియా ఆగడాలు బయటపడుతూనే ఉన్నాయి.. ఇందులో పొలిటికల్ బ్యాక్ డ్రాప్ కూడా ఉందన్న ఆరోపణలు వచ్చాయి అప్పట్లో..! నెల్లూరులో గత కొన్నేళ్లుగా బెట్టింగ్ మాఫియా అంతరించిపోయిందని అంతా అనుకున్నారు. కానీ చాప కింద నీరులా బెట్టింగ్ మాఫియా ఆగడాలు యథావిధిగానే కొనసాగాయి. ఒకప్పుడు నెల్లూరు తమిళనాడు కేంద్రంగా జరిగిన బెట్టింగులు నేడు దేశ విదేశాలకు విస్తరించాయి. విజిటింగ్ వీసాలతో దుబాయ్, బ్యాంకాక్, శ్రీలంక, మలేషియా తోపాటు విదేశాలకు వెళ్లి, నెల రోజులపాటు అక్కడే ఉండి, బెట్టింగ్ గురించి పూర్తిగా తెలుసుకుని నెల్లూరుకు వచ్చి ఆ బెట్టింగ దండాను ఇక్కడ విస్తరిస్తున్నారు కేటుగాళ్లు. ఒక చిన్న కంప్లైంట్ తో విచారణ మొదలుపెట్టిన నెల్లూరు పోలీసులు విదేశాల బెట్టింగ్ రాకెట్‌ను బయటకు లాగారు. ఈ బెట్టింగ్ రాకెట్‌లో ఇద్దరు ఇంటర్నేషనల్ బెట్టింగ్ రాయుళ్లను గుర్తించారు. నెల్లూరులోనే ఉంటూ రెండు మూడు నెలలకు ఒకసారి విజిటింగ్ వీసాల పేరుతో విదేశాలకు వెళ్లి అక్కడ బెట్టింగ్ వ్యవహార శైలిని నేర్చుకుని వస్తున్నారు. ఇక్కడికి వచ్చి సామాన్యులకు వల వేసి బెట్టింగ్ ముగ్గులోకి లాగుతున్నారు. ఎట్టకేలకు ఇద్దరు కేటుగాళ్లను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు విస్తుపోయే వాస్తవాలను గుర్తించారు. బాలాజీనగర్ పోలీస్ స్టేషన్ పరధిలో ఫిబ్రవరి 19వ తేదీ బెట్టింగ్‌పై ఓ కంప్లైంట్ వచ్చింది. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని బెట్టింగ్ నిర్వహిస్తున్నారని ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో వెంటనే స్పందించిన బాలాజీ నగర్ పోలీసులు బుచ్చిరెడ్డిపాలెంలోని ఇంటిపై రైడ్ చేశారు. దీంతో వెంకటరమణ, వెంకటేశ్వర్లు అనే ఇద్దరిని అరెస్ట్ చేశారు. అలాగే వారి వద్ద నుంచి రూ.34.65 లక్షల నగదు తోపాటు ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు సహా వారి అకౌంట్లలో ఉన్న రూ.1.64 కోట్లను ఫ్రీజ్ చేశారు పోలీసులు. అయితే పోలీస్ రైడ్‌లో మరో ఇద్దరు బెట్టింగ్ రాయుళ్లు అక్కడి నుంచి పారిపోయారు. పారిపోయిన వారి గురించి విచారించిన పోలీసులకు వారికి బినామీలు మాత్రమేనని, వీరి వెనక మరో ఇద్దరు బెట్టింగ్ డాన్‌లు ఉన్నట్లు గుర్తించారు పోలీసులు. మరో ఇద్దరు మహేష్ ,హరికృష్ణ అనే వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరూ మూడు నెలలకు ఒకసారి దుబాయ్, బ్యాంకాక్, శ్రీలంక, మలేషియా వంటి దేశాలకు విజిటింగ్ వీసాలతో వెళ్తారు. అక్కడ పలు యాప్‌లలో బెట్టింగ్ విధానాన్ని పూర్తిగా తెలుసుకుని ఇండియాకు తిరిగి వస్తారు. అదే యాప్‌ల సాయంతో అక్కడి వారితో కలిసి బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ బెట్టింగ్‌లో కొత్తగా బి టు బి అంటే బిజినెస్ టు బిజినెస్ అనే విధానాన్ని అవలంబిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రతి బాల్‌కు ప్రతి క్యాచ్‌కు ఒక రేటును ఫిక్స్ చేస్తారు. అయితే ఈ బి టు బి విధానంలో ఎవరు నష్టపోయిన మహేష్, హరికృష్ణ అనే వారికి మాత్రం లక్షల్లో రాబడి వస్తుంది. తీగ లాగితే దొంగ కదిలినట్టు బుచ్చిరెడ్డిపా లెంలో పోలీసుల రైడ్ చేస్తే విదేశాల్లో బెట్టింగ్ వ్యవహారం బయటకు వచ్చింది. ఈ వ్యవహారంలో మహేష్ హరికృష్ణలతో పాటు మరో నలుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు పోలీసులు.



# కాకినాడ సెజ్ భూములు రైతులకు తిరిగి అప్పగింపు

## అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ షణ్మోహన్



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లాలో సెజ్‌కు చెందిన భూములను తిరిగి రైతుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేసి ఆయా రైతులకు అప్పగించే ప్రక్రియ కొనసాగుతున్నదని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. గురువారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తో కలిసి రెవెన్యూ, సెజ్, రిజిస్ట్రేషన్ ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ కాకినాడ రూరల్, యు.కొత్తపల్లి, తొండంగి మండలాల పరిధిలో భూమిని సెజ్ పరిధిలోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఈ భూములను అర్హత గల రైతుల వారి పేర్లపై తిరిగి రిజిస్ట్రేషన్ చేయించే చర్యలను ప్రభుత్వం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ భూములకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రత్రాలపై స్టాంప్ డ్యూటీ మరియు రిజిస్ట్రేషన్ ఫీజులు పూర్తిగా మినహాయింపు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. రైతులు తమ భూములు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు, దస్తావేజులు, ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వే నోటీసుల వివరాలు అన్ని మార్చి 13 నాటికి ఆయా మండలాల తహశీల్దార్ల కార్యాలయంలో సమర్పించాలన్నారు. సెజ్ భూములు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించి రెవెన్యూ, సెజ్, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సెజ్ భూములు రైతులు పేరును బదిలీ చేసే ప్రక్రియ సజావుగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్ఓ తిప్పేనాయక్, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్ మల్లి బాబు, ఎన్. శ్రీధర్, జిల్లా రిజిస్టర్ కె.ప్రసాద్‌రావు, కాకినాడ రూరల్, తొండంగి, యు.కొత్తపల్లి మండలాల తహశీల్దార్లు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుంచే సమాజాన్ని చదవాలి

## అన్ని రంగాల్లోనూ మహిళలే ముందుండాలి - మహిళా దినోత్సవ వేడుకల్లో ఐసిడిఎస్ సిడిపీఓ

**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బాల బాలికలు అందరూ తమ విద్యార్థి దశ నుంచే తరగతి పుస్తకాలతోపాటు సమాజంలోని అన్ని అంశాలనూ చదవాలి... సమగ్ర అవగాహన ఏర్పరచుకోవాలి... అన్ని రంగాల్లోనూ మహిళలే ముందుండాలని ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల ఐసిడిఎస్. సిడిపీఓ. తేపర్తి దేవీరత్న పద్మావతి పిలుపును ఇచ్చారు. బాల్య దశలోనే ఎవరూ వివాహాలను చేసుకోరాదని, బాల్య వివాహాలను ప్రోత్సహించడం, చేయడం చట్ట విరుద్ధమని, ఇవి శిక్షార్హమైన నేరమని పద్మావతి వివరించారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం మండలం ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభికులను ఉద్దేశించి సిడిపీఓ. ప్రసంగించారు. తొలుత మహిళలు అందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలను తెలిపారు. బాలికలు, మహిళల సాధికారిత, వారి హక్కులు, సమానత్వం, న్యాయ అవగాహన కల్పించేందఉ 20 రోజుల పాటు నిర్వహించే ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా చేపట్టిన నేటి ఈ కార్యక్రమంలో విద్య, న్యాయస్థానం, చట్టం, ఆరోగ్యం తదితర అంశాలపై విద్యార్థులు, మహిళలకు సిడిపీఓతో ఆయా శాఖల అధికారులు వివరించారు. ప్రస్తుత సమాజంలో మహిళలు తెలుసు కోవలసిన విషయాలపై ప్రముఖంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీల్లో నైపుణ్యాలను ప్రదర్శించి, ప్రతిభను కనబరిచిన విద్యార్థి విజేతలకు ప్రముఖులతో బహుమతులను పంపిణీ చేశారు.



వివిధ రంగాల్లో విధులను నిర్వహిస్తున్న ఆదర్శ మహిళా మణులను ఘనంగా సన్మానించారు. అలాగే ఈ కార్యక్రమ నిర్వాహకురాలు ఐసిడిఎస్. సిడిపిఓ. దేవీరత్న పద్మావతికి కూడా సభికుల తరఫున ఘన పౌరసత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి, వకీలు బుగత శివ, డాక్టర్ సౌభాగ్య సరోజ, ఎంఈఓ. వరలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్వైజర్ సూర్య కుమారి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్, మెప్మా మేనేజర్ ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది, పలువురు విద్యార్థినీ విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

# ఏపీలోని మందుబాబులు ఎగిరి గంతేసే వార్త..




ఏపీలోని మందుబాబులకు ఊరట కలిగించే నిర్ణయం త్వరలో కూటమి ప్రభుత్వం తీసుకొనుంది. త్వరలో ఎక్సైజ్ శాఖ కొత్త పాలసీని తీసుకురానుంది. మద్యం షాపులు, బార్లలో డిజిటల్ పేమెంట్స్‌ను ప్రవేశపెట్టడం కోసం ప్రత్యేక పాలసీని అమలు చేయనుంది. ఆ పాలసీ పేరే లిక్కర్ డిజిటల్ చెల్లింపులు. ఈ పాలసీ ద్వారా తప్పనిసరిగా ప్రతీ షాపు, బార్లలో డిజిటల్ పేమెంట్స్ చేసే సౌకర్యాన్ని మందుబాబులకు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానుంది. దీని వల్ల కస్టమర్లు సులువుగా పేమెంట్ చేసే సౌలత్యంతో పాటు మద్యం విక్రయాల్లో పారదర్శకత లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పాలసీ అమల్లోకి వచ్చాక షాపుల యజమానులు కస్టమర్ల నుంచి ఖచ్చితంగా డిజిటల్ పేమెంట్స్ స్వీకరించాల్సి ఉంటుంది. వాటిని తిరస్కరించడం కుదరదు.

**నెల రోజుల్లో అమలు :** ప్రస్తుతం ఎక్సైజ్ శాఖ ఈ డిజిటల్ విధానం ఫైల్‌ను సిద్ధం చేసింది. రాబోయే మంత్రివర్గ సమావేశంలో ఈ పాలసీని కేబినెట్ ముందు ఉంచనుంది. కేబినెట్ ఆమోదం తెలిపాక ఈ కొత్త విధానం అమల్లోకి రానుంది. ప్రస్తుతం డిజిటల్ విధానంలో మద్యం కొనుగోలుదారుల నుంచి షాపుల యజమానులు పేమెంట్లు స్వీకరిస్తున్నా.. శాశ్వత విధానంలో దీనిని అమలు చేసేందుకు పాలసీ తీసుకొస్తున్నారు. దీని వల్ల ఇక ఖచ్చితంగా డిజిటల్ పేమెంట్స్ స్వీకరించాల్సి ఉంటుంది. ఇందుకోసం షాపులు, బార్లకు అవసరమైన పరికరాలను కూడా ఎక్సైజ్ శాఖ అందించనుంది. ప్రస్తుతం మద్యం విక్రయాల్లో 30 శాతం వరకు మాత్రమే డిజిటల్ పేమెంట్స్ జరుగుతున్నాయి. దీనిని 60 శాతంకు పెంచేందుకు ఎక్సైజ్ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహించేందుకు కూడా కొత్త నిర్ణయం ఉపయోగపడుతుందని ఎక్సైజ్ శాఖ పేర్కొంది.

**సీరియస్‌గా తీసుకోని యజమానులు :** ప్రస్తుతం రాష్ట్రంలోని మద్యం షాపులు, బార్లలో డిజిటల్ పేమెంట్ నిబంధన అమల్లో ఉంది. కానీ షాపుల యాజమానులు సీరియస్‌గా తీసుకోవడం లేదు. ప్రతీసారి పాలసీలో ఈ నిబంధన పొందుపర్చాల్సి వస్తోంది. దీంతో శాశ్వతంగా ఈ నిర్ణయాన్ని అమలు చేసేందుకు ప్రత్యేక పాలసీకి రూపకల్పన చేశారు. ఇక నుంచి డిజిటల్ పేమెంట్స్ అన్నీ రియల్ టైమ్‌లో ఎక్సైజ్ శాఖ డేటాబేస్‌లో నిక్షిప్తం అవుతాయి. దీని వల్ల ఏ రోజు ఎంత మద్యం విక్రయాలు జరిగాయనే సమాచారం కూడా తెలుసుకోవచ్చు. ఉత్పత్తి నుంచి అమ్మకం వరకు ప్రతీచోట డిజిటల్ లావాదేవీలు జరిగేలా చర్యలు తీసుకోనుంది. ట్రాక్ అండ్ ట్రేస్ విధానాన్ని ఇందుకోసం తీసుకురానుంది. ప్రతీ షాప్, బార్‌కు ప్రభుత్వమే స్కానర్ ఇస్తుంది. ఖచ్చితంగా స్కాన్ చేసిన తర్వాతే కొనుగోలుదారులకు సీసా ఇవ్వాల్సి ఉంటుంది. ఇక కొనుగోలుదారులు పేమెంట్ చేస్తే ఎక్సైజ్ శాఖకు తెలుస్తుంది.

# స్కూల్ సమీపంలో మద్యం షాపు..

ప్రభుత్వ అనుమతులు ఉన్నాయంటూ ఎక్కడ పడితే అక్కడ మద్యం షాపులు ఏర్పాటు చేసేస్తున్నారు. మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్ల ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ నియమనిబంధనలు ఉన్నా కొంతమంది బడి, గుడి, నివాస సముదాయాల సమీపంలోనే మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తుండటం వివాదాలకు దారి తీస్తోంది. మార్కాపురం జిల్లా కేంద్రంలో ఓ బార్ అండ్ రెస్టారెండ్ స్కూలుకు సమీపంలో ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. గుడి, బడి అనే తేడా లేకుండా, మద్యం షాపులు ఏర్పాటు చేస్తుండటంతో స్థానికులు ఆందోళనలకు దిగుతున్నారు. మార్కాపురం జిల్లా మార్కాపురం పట్టణంలోని పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన బార్ అండ్ రెస్టారెంట్ ను ఎత్తివేయాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో షాపు ఎదుట విద్యార్థులు ధర్నా చేశారు. తరగతులను బహిష్కరించి నిరసనలు చేపట్టారు. డిఎస్ఆర్ పేరుతో ఏర్పాటు చేసిన బార్ అండ్ రెస్టారెంట్ పాఠశాల, రామాలయం సమీపంలో ఏర్పాటు చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని విద్యార్థి సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. మద్యం షాపును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అక్కడి నుంచి మద్యం షాప్ తొలగించేంత వరకు బడికి వెళ్ళేది లేదని విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని




తొలగించాలని గత కొన్ని రోజులుగా విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంపై విద్యార్థి సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణం బార్ అండ్ రెస్టారెంట్ తొలగించి చర్యలు తీసుకోవాలని పట్టణ పోలీసులకు, అనంతరం సబ్ కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు.

# ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు ఆహ్వానం




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మండల కేంద్రం శంఖవరంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాల (ఎ.పి. మోడల్ స్కూల్లో)లో 2026-2027 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో నికి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 5 వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో నుంచి ఆదర్శ పాఠశాల ఆరో తరగతిలోనికి చేరడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు 2026 ఫిబ్రవరి 25 వ తేదీ నుంచి 2026 మార్చ్ 31 వరకు అంతర్జాలంలో దరఖాస్తు చేసుకోవాలి. ప్రవేశ అర్హత నిర్ధారణకు ఏప్రిల్ 12 న ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. పరీక్షా రుసుముగా ఓసి, బీసీలు రూ. 200లు, అదే ఎస్సీ, ఎస్టీలైతే రూ. 125 లను మాత్రమే చెల్లించాలని, పూర్తి వివరాలకు 7075773456, 9640432230 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపి.మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.వీరరాజు మీడియాకు తెలిపారు.

## డ్రైన్లు పూడిక తీయక

# కాలనీవాసులు ఇబ్బందులు



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** డ్రైన్లు నిర్మించారు కానీ వాటిని ఏళ్ల గడుస్తున్న పూడికలు తీయక పోవడంతో నానా చెత్త చెదారం ఏర్పడి తద్వారా దోమల ప్రబలి కాలనీవాసులకు వ్యాధులు ప్రవళి ఆసుపత్రి పాలవుతున్నారని కాకినాడ రూరల్ మండలం వాకలపూడి గ్రామ రాజాజీ నగర్, ఎఫ్సిఐ కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కృష్ణ, జగదీష్ లు మాట్లాడుతూ సంవత్సర కాలంగా డ్రైన్ పూడిక తీయలేకపోవడంతోటే నివాసులు అందరూ చాలా ఇబ్బందులు పడుతున్నామని అధికారికి దగ్గరికి వెళ్లి ఫిర్యాదు చేస్తే అసహ్యించుకుంటున్నాడని కనీసం గౌరవించట్లేదని మర్యాద మంచి లేకుండా మాట్లాడుతున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఎఫ్సిఐ కాలనీలో మురుగునీరు నిలవ ఉండడంతో ఆ ప్రాంతమంతా పందులు పశువులు ఆ మురుగునీడిలో ఉండటం వల్ల ఇబ్బందులు పడుతున్నామని దోమలు విపరీతంగా ఉండటంవల్ల అనేక రోగాలు వస్తున్నాయని కనీసం దోమల మందు గానీ, వాడటం లేదని అడిగితే పంచాయతీలో డబ్బులు లేవంటూ పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతున్నాడని అన్నారు.

# పన్నులు వసూళ్లు వేగవంతం చేయాలి



**కాకినాడ రూరల్(కరప): విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్థిక సంవత్సరం ముగింపు లోపుగా ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేసి ఆన్లైన్ పన్నుల విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కరప మండల అభివృద్ధి అధికారి(ఎంపిడిఓ) జటావల్లభుల శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కరప మండలం గొడ్డటిపాలెంలో గురువారం పర్యటించి పన్నులు వసూళ్ల పనితీరు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి త్రిపుర శంకర పన్నులు ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు వసూళ్లు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ప్రభుత్వం ఆదేశాల ప్రకారం ఆన్లైన్ లోనే పన్నులు కట్టించుకోవాలని ప్రజలకు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో త్రిపుర శంకర పంచాయతీ కార్యదర్శి, డిప్యూటీ ఎంపీడీవో సలాది శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

# 1152వ రోజు అభాగ్యులకు అన్నదానం



**తాళ్లరేవు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం తాళ్లరేవు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం లయన్ కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మార్పణ్ అన్నదాన కార్యక్రమం ద్వారా అభాగ్యులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ అన్నదానం కార్యక్రమం ప్రారంభించి 1152 రోజులు అవుతుందని, ఈ అన్నదానం కార్యక్రమం ప్రతిరోజు నిరంతరం కొనసాగిస్తున్నామని, ఎందరో దాతల సహకారంతో మరియు లయన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో కార్యక్రమం ద్వారా ఎంతో మంది అభాగ్యులకు ఆహారం అందిస్తున్నామని అన్నారు. లయన్స్ క్లబ్ సేవలను పలువురు అభినందించారు. అన్నదాన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు దాతలు పాల్గొన్నారు.

# ఈకేవైసీ నమోదుతో పాస్‌బుక్కుల జారీ వేగవంతం

## తహసిల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్




**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వం భూసంబంధిత సేవలను పారదర్శకంగా అందించేందుకు, రైతులకు మెరుగైన సేవలు అందించడానికి ఈకేవైసీ నమోదు తప్పనిసరి చేసినట్లు కాజులూరు తాహసిల్దార్ జి రవీంద్రనాథ్ ఠాగూర్ తెలిపారు. కాజులూరు మండలం కోలంక గ్రామంలో రెవిన్యూ అధికారులు ఈకేవైసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తాహసిల్దార్ ఠాగూర్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈకేవైసీ నమోదు పూర్తయిన తర్వాత మాత్రమే భూమి పాస్‌బుక్కులు జారీ చేయబడతాయని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ద్వారా భూస్వామ్య వివరాలు సరిచూడడం సులభమవుతుందని వివరించారు. రైతులు తమ ఆధార్, భూమి సంబంధిత పత్రాలు, ఇతర అవసరమైన వివరాలతో గ్రామ సచివాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఈకేవైసీ సిబ్బందిని సంప్రదించి ఈకేవైసీ నమోదు చేసుకోవాలని సూచించారు. ఈకేవైసీ ప్రక్రియ పూర్తయిన తరువాత భూస్వాముల వివరాలు అధికారిక రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయబడతాయనీ తద్వారా భూమి యాజమాన్యంపై ఎటువంటి వివాదాలు లేకుండా స్పష్టత ఏర్పడుతుందని తెలిపారు. అదేవిధంగా, ఈకేవైసీ నమోదు చేయించుకున్న రైతులకు భవిష్యత్తులో ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు కూడా సులభంగా అందుతాయని ల వెల్లడించారు. రైతులు ఆలస్యం చేయకుండా తక్షణమే తమ ఈకేవైసీ నమోదు పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ చర్య వల్ల భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత పెరగడంతో పాటు, రైతులకు సేవలు మరింత వేగంగా అందించే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ చందన, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వేగేశ్వరరావు, గ్రామ రెవెన్యూ అధికారులు ఈశ్వరరావు, రాధాకృష్ణ, సత్యనారాయణ, రాయుడు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, లోవరాజు పలువురు రెవెన్యూ అధికారులు, రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలోనే తొలిసారిగా అరుదైన శస్త్ర చికిత్స

**విజయభారతి చెస్ట్ ఇన్స్టిట్యూట్ పల్స్ హాస్పటల్ వైద్య నిపుణుల ఘనత**
**ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారి మెడ్ట్రానిక్ ఎఫ్‌కే వాల్వ్‌తో క్లిష్టమైన టీఏవీఆర్ శస్త్రచికిత్స విజయవంతం**
**వైద్య బృందాన్ని అభినందించిన డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాధిక**






**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్ :** విజయ భారతి చెస్ట్ ఇన్స్టిట్యూట్ పల్స్ హాస్పిటల్స్‌లోని కార్డియాలజీ విభాగం వైద్యులు 75 ఏళ్ల వృద్ధ మహిళకు క్లిష్టమైన ట్రాన్స్‌కాథెటర్ ఎటోర్టిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ (టిఏవిఆర్) శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి అరుదైన శస్త్ర చికిత్సతో ఘనత సాధించారు. ఈ శస్త్ర చికిత్స నిర్వహిం చిన వైద్య నిపుణుల బృందాన్ని విజయ భారతి చెస్ట్ ఇన్స్టిట్యూట్ అధినేత, ప్రముఖ పలమనాలజిస్ట్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, యజమాన్య సీఈవో రాధిక గూడూరి అభినందించారు. ఈ చికి త్సకి సంబంధించిన వివరాలు పలు అంశాలను వైద్య నిపుణులు డాక్టర్ గూడూరి శ్రీనివాస్, డాక్టర్ లక్ష్మణ్ కొల్లూరి, డాక్టర్ వంశీకృష్ణంరాజు, డాక్టర్ సాజిత్ కిషన్ గురువారం మీడియాకు వివరించారు. ఈ శస్త్ర చికిత్సలో మెడ్ట్రానిక్ ట్రాన్స్‌కాథెటర్ వాల్వ్ సిస్టమ్‌కు చెందిన ఎఫ్‌కే వాల్వ్‌ను ఉపయోగించడం ప్రత్యేకత. ఈ ఆధునిక వాల్వ్ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహిం చిన తొలి శస్త్రచికిత్సగా ఇది గుర్తింపు పొందిందని చెప్పారు. టీఏవీఆర్ అనేది సంప్రదాయ ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండా చేసే ఆధునిక మినిమల్ ఇన్వేసివ్ విధానమని,సాధారణంగా కాలి ఫెమొరల్ ఆర్టరీ ద్వారా కాథెటర్ ప్రవేశపెట్టి, దాని ద్వారా కొత్త వాల్వ్‌ను హృదయంలోని దెబ్బతిన్న ఎటోర్టిక్ వాల్వ్ స్థానంలో అమర్చుతారని, ఈ విధానం వల్ల నొప్పి తక్కువగా ఉండడం, రక్తస్రావం తగ్గడం, ఆసుపత్రిలో ఉండే రోజులు తగ్గడం, అలాగే త్వరగా కోలుకునే అవకాశం ఉండటం ముఖ్యంగా వృద్ధులకు ఎంతో ప్రయోజనకరమన్నారు. ఈ కేసులో రోగికి తీవ్రమైన ఎటోర్టిక్ స్టెనోసిస్‌తో పాటు సంబంధిత భాగంలో గణనీయమైన సంక్లిష్టతలు ఉండటంతో శస్త్రచికిత్స చాలా క్లిష్టంగా మారిందని, అయితే ముందస్తు పరీక్షలు, ఖచ్చితమైన ఇమేజింగ్, వైద్యుల సమన్వయం వల్ల ఈ ప్రక్రియ విజయవంతమైందని వెల్లడించారు.ఈ శస్త్రచికిత్సను ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టులు డాక్టర్ కొల్లూరి లక్ష్మణ్, డాక్టర్ వంశీ కృష్ణంరాజు కోసూరి, డాక్టర్ సాజిత్ కిషన్ కలిసి నిర్వహించారు. వీరికి కార్డియాక్ అనస్థీషియా నిపుణులు, కాథ్ ల్యాబ్ సిబ్బంది పూర్తి సహకారం అందించారు. శస్త్రచికిత్స అనంతరం అమర్చిన వాల్వ్ సక్రమంగా పనిచేస్తుండగా, రోగిని కొద్ది రోజుల్లోనే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ఈ విజయవంతమైన శస్త్రచికిత్స ఆధునిక మినిమల్ ఇన్వేసివ్ వైద్య విధానాల ప్రభావాన్ని మరోసారి నిరూపించిందని వైద్యులు అన్నారు. ఈ విజయంతో పల్స్ హాస్పిటల్స్ మరోసారి అత్యాధునిక హృదయ చికిత్సలు, ఆధునిక మినిమల్ ఇన్వేసివ్ కార్డియాక్ సేవలను టియర్-2 నగరంలో కూడా సమర్థంగా అందించగల సామర్థ్యాన్ని నిరూపించిందని వారు పేర్కొన్నారు. .రాజమహేంద్రవరం నగరంలో ఉన్న పల్స్ హాస్పిటల్స్ ఒక ప్రముఖ స్థాయి వైద్య కేంద్రంగా పేరుగాంచింది. అత్యాధునిక కాథ్ ల్యాబ్‌తో పాటు సమగ్ర హృదయ చికిత్సా సౌకర్యాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని, ఆసుపత్రిలోని నిపుణులైన కార్డియాలజీ బృందం మెట్రో నగరాల్లో అందించే స్థాయి ఆధునిక హృదయ చికిత్సలను ఇక్కడే అందిస్తోందని తెలిపారు..ఈ క్లిష్టమైన శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందాన్ని విజయభారతి చెస్ట్ ఇన్స్టిట్యూట్ అధినేత డాక్టర్ గుడూరి శ్రీనివాస్ అభినందించారు. మెట్రో నగరం కాకపోయినా రాజమండ్రి నగరంలో ఇంత క్లిష్టమైన వైద్య ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడం గొప్ప విషయమని ఆయన పేర్కొన్నారు. పల్స్ హాస్పిటల్స్‌లో హృదయ, ఊపిరితిత్తుల చికిత్సలను సమగ్రంగా అందిస్తున్నామని. ఐదుగురు పల్మనాలజిస్టులు, ముగ్గురు కార్డియాలజిస్టులు కలిసి ఒకే చోట రోగులకు సమగ్ర వైద్య సేవలు అందిస్తున్నారని డాక్టర్ గూడూరి శ్రీనివాస్ చెప్పారు.మిగతా చోట్లతో పోలిస్తే తక్కువ 40 శాతం తక్కువ ఖర్చుతో తమ ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు చేస్తున్నామని ఆయన తెలిపారు.

### పాల కల్తీ ఎలా జరిగిందనేది

# బయట పెట్టని ప్రభుత్వం

**ప్రభుత్వ వైఫల్యం వల్లే కల్తీ పాలు త్రాగి 9 మంది మృతి - ఈ సంఘటన ప్రభుత్వ హత్యలుగా పరిగణించాలి**
**మృతి చెందిన బాధితులకు రూ. 20 లక్షలు చెల్లించాలి : మాజీ ఎంపీ మార్గాని భరత్**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వం వైఫల్యం వల్లే కల్తీ పాలు సంఘటన చోటుచేసుకుందని వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాన్ని భరత్ రామ్ ఆరోపించారు. కల్తీ పాలు తాగి 9 మంది మృతి చెందిన సంఘటనపై గురు వారం ఏవీ అప్పారావు రోడ్డులోని రామాదయం సెంటరులో నిరసన వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులతో కలసి మానవహారంగా ఏర్పడి పాల కల్తీ ఘటన పైన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రభు త్వం వైఫల్యం వల్ల 15 రోజులు గడిచినప్పటికీ రోజు కూడా డెడ్ బాడీ హాస్పిటల్ నుంచి బయటికి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే అని ఆరోపించారు. రాష్ట్రంలో సంచలన శిక్షణ కల్తీ పాలు సంఘటనలో 9 మంది మృతి చెందినప్పటికీ ఫుడ్ సేఫ్టీ అధికా రులు పాల కేంద్రాలను ఎందుకు తనిఖీలు నిర్వహించడం లేదని ప్రశ్నించారు.ఫుడ్ సేఫ్టీ అధికారులపై చర్యలు ఎందుకు తీసు కోలేదని నిలదీశారు. కూటమి ప్రభుత్వం చీకటి వ్యవహారం నడుపుతోందని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ సంఘటన ఎలా జరిగింది? ఎవరి ప్రమేయం ఉందో? వాస్తవాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. వేట్లపాలెంలో మృతి చెందిన బాధితులకు రూ.20 లక్షల ప్రకటించిన ప్రభుత్వం, రాజ మండ్రిలో పాల కల్తీ పాలు త్రాగి మృతి చెందిన బాధితులకు రూ.10 లక్షల ప్రకటిం చడమేమిటి అని ప్రశ్నించారు. అక్కడ ప్రాణమే, ఇక్కడ ప్రాణమే కదా అని నిలదీశారు. ప్రస్తుతం ఆసుపత్రులలో 13 మంది చికిత్స పొందుతున్నారని వారికి ఏ విధమైన వైద్య సౌకర్యం కల్పిస్తున్నారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎథిలిన్ గ్లైకాల్ కలిస్తే యాంటిడోస్ తెప్పించామని అన్నారని, ఎంతమందికి ఇచ్చారో వివరాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు.కల్తీ పాలు సంఘటనకు సంబంధించి వివరాలు గోప్యంగా ఉంచుతున్నారంటే అర్థం ఏమిటని ప్రశ్నించారు. అలాగే చిన్న పాల వ్యాపారులను ప్రోత్సహించి భద్రతా నియమా లను పాటించేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని కోరిన భరత్. ఈ కార్యక్రమంలో వార్డ్ ఇంచార్జీలు, వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మధునా పంతులు 106వ జయంతి ఘన నివాళి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రుల చరిత్ర, ఆంధ్ర కవులు వంటి మహాకావ్యాలను తెలుగు ప్రజలకు అందించిన మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి పేరు పేరెన్నెక కవులలో ప్రముఖులని ఆంధ్ర కేసరి యువజన సమితి పూర్వ అధ్యక్షులు మాదిరాజు శ్రీనివాస్ అన్నారు. ఆంధ్ర కేసరి యువజన సమితి సంస్థను తన చేతుల మీదుగా ప్రారంభించిన మధునా పంతుల వారి 106వ జయంతి కార్యక్రమం ఆంధ్ర కేసరి డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కళాశాల కరస్పాండెంట్ జి రమణయ్య మాట్లాడుతూ మధునా పంతులు వారు రాజమండ్రిలో ఉపాధ్యాయ వృత్తి చేయడం ఇక్కడ ప్రజల అదృష్టం అన్నారు. కళా ప్రపూర్ణ బిరుదును కూడా ఆయన పొంది సాహిత్య అకాడమీ పురస్కారాన్ని పొందరన్నారు. సమితి పూర్వాధ్యక్షులు దేశిరెడ్డి బలరామ నాయుడు మాట్లాడుతూ ఆంధ్ర కేసరి యువజన సమితి నగరంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తుందని దీనికి ఆరాధ్యులు మధునాపంతులు వారిని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు రఘుపాత్రుని సాయిబాబా, కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్ కిరణ్, వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్ అప్పారావు ఇతర అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 8న ఉపాధి హామీ పరిరక్షణ యాత్రను విజయవంతం చేయండి

**పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిళ జిల్లాకు రాక - డిసిసి అధ్యక్షుడు బోడా వెంకట్ పిలుపు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బుధవారం ఉదయం కంబాల చెరువు మెగా ఫంక్షన్ హాల్ నందు తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోడ వెంకట్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం జరిగింది 8వ తారీఖున పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర సందర్భంగా తూర్పుగోదావరి జిల్లాకు విచ్చేయుచున్న సందర్భంగా జిల్లా మరియు నగర మండల అధ్యక్షులతో జిల్లా కోఆర్డినేటర్స్‌తో స్టేట్ నాయకులతో ఎస్సీ,ఎస్టీ బీసీ, మైనారిటీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు వివిధ విభాగాల అనుబంధ సంస్థలు నాయకులతో చర్చించి తీసుకోవలసిన బాధ్యతలు కార్యక్రమాన్ని విజయవంతంగా జరపాలని కోరుతూ అందరూ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ ప్రధాన కార్యదర్శి పట్నాల శ్రీనివాస్, స్టేట్ పిసిసి సెక్రెటరీ అరిగెల అరుణకుమారి, పీసీసీ మాజీ సెక్రెటరీ జ్యేష్ట సతీష్ బాబు, స్టేట్ ప్రచార కమిటీ చైర్మన్ డాక్టర్ వడియార్, నిడదవోలు కోఆర్డినేటర్ మేడవరపు భద్రందొర, పిసిసి మాజీ అధికార ప్రతినిధి కొవ్వూరు శ్రీనివాస్, నగర మహిళా అధ్యక్షులు దారపురెడ్డి సుజాత, లీలావతి, పిసీసీ కార్యవర్గ సభ్యులు చిన్నం మురళీకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చింతాడ వెంకటేశ్వర రావు,ఇజ్జవరపు సత్యనారా యణ, శెట్టి ప్రతాప్, మండల అధ్యక్షులు అభిశక్తుడు, భావన రమేష్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు కార్యకర్తలు విరివిగా పాల్గొన్నారు. వ్యక్తులు మాట్లాడుతూ షర్మిల రెడ్డి యాత్రను కాంగ్రెస్ శ్రేణులు అందరూ సమష్టిగా కార్యక్రమం ఎంతో జయప్రదంగా ఉన్నతంగా చేయాలని కోరుతూ నిర్ణయించారు.షర్మిల రెడ్డి రచ్చబండ కార్యక్రమాలు జిల్లాలో రెండు చోట్ల పోలీసు అధికారులు పర్మిషను తో ఏర్పాటు చేస్తామని మరిన్ని ఏర్పాట్లు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు.


# 10న నన్నయలో ప్లేస్మెంట్ డ్రైవ్

**రాజమహేద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఎన్‌జిఎస్, శ్యాం సొల్యూషన్స్ ఎస్‌డివివిఎల్, ఫ్లైస్ కంపెనీల ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4.30వరకు యూనివర్సిటీ సెమినార్ హాల్లో క్యాంపస్ ప్లేస్మెంట్స్ నిర్వహిస్తున్నట్టు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్ ప్రసన్న శ్రీ తెలిపారు. బిటెక్, బిఇ, ఏదైనా డిగ్రీ చదివిన అభ్యర్థులకు వివిధ పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహించబడుతున్నాయని తెలిపారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు 2.8 లక్షల నుంచి 8.0 లక్షలు వరకు వేతనం మరియు కేటగిరీలు వారీగా ఇంక్రిమెంట్లు అలెన్సులు ఉంటాయన్నారు. ఎంపికైన వారికి వసతి సదుపాయం కల్పిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9347 153 270 నెంబర్‌లను సంప్రదించాలని సూచించారు.

### పుష్కర, పురుషోత్తపట్నం రైతులకు

# నష్టపరిహారం ఇప్పించండి : బొడ్డు

**నియోజకవర్గంలో రోడ్లకు నిధులు ఇవ్వండి**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** నియోజకవర్గంలోని పురుషోత్తపట్నం, పుష్కర ఎత్తిపోతల పథకం కోసం భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని, బొడ్డు వెంకటరమణ చౌదరి మర్యాదపూర్వకంగా కలిసి రాజానగరం నియోజకవర్గం సీతానగరం మండలంలోని పురుషోత్త పట్నం, చినకొండేపూడి, నాగంపల్లి గ్రామాల రైతులు ఎత్తిపోతల పథకానికి భూములు ఇచ్చిన 92మంది రైతులకు న్యాయమైన పరిహారం అందక ఆందోళన చెందుతున్నారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లమన్నారు.అదేవిధంగా రాజానగరం నియోజకవర్గంలో కొన్ని గ్రామాల్లో ముఖ్యమైన రోడ్లు అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నరని చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లామన్నారు. అనివార్య కారణాల వల్ల కొంత మందికి ముఖ్యమంత్రి సహాయనిధి దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని, మానవతాద్రుక్పదంతో బాధితులకు ఆర్థిక సహాయం చేయాలని వినతిపత్రం సమర్పించమన్నారు. ఈ విషయాలను పరిష్కరిస్తానాని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారన్నారు.

# ఆత్మీయ సన్మానం నా హృదయంలో చిరస్మరణీయం

**అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో నర్సిపల్లి హారిక**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ సంస్థ శ్రీ శ్రీ కళావేదిక మరియు సవ్యసాచి (గ్రూప్స్) ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనే అవకాశం కలగడం నాకు ఎంతో ఆనందాన్నీ, గౌరవాన్నీ అందించింది. మహిళా శక్తి, ప్రతిభ, ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలిచిన ఆ వేదిక నిజంగా స్ఫూర్తిదాయకంగా అనిపించింది. కార్యక్రమం సందర్భంగా ఊహించని విధంగా నన్ను సన్మానించడం నా జీవితంలో ఒక అపూర్వమైన క్షణంగా నిలిచిపోయింది. కూచిపూడి నృత్య ప్రదర్శన మధ్య సాంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఆ సన్మానం కేవలం గౌరవం మాత్రమే కాదు..అది నా సేవలను, నా ప్రయాణాన్ని గుర్తించిన ప్రేమాభిమానాల ప్రతీకగా అనిపించింది.ఆ ఆత్మీయ సన్మానం నా హృదయంలో చిరస్మరణీయంగా నిలిచిపోయింది. ఈ సందర్భంగా "ఉమెన్ ఎక్సలెన్స్ అవార్డు"ను కూడా ప్రదానం చేయడం నాకు మరింత ఆనందాన్ని, గౌరవాన్ని కలిగించింది. దాదాపు 500 మంది మహిళలు పాల్గొన్న ఈ మహోత్సవంలో, వారిని నా చేతుల మీదుగా సత్కరించే అవకాశం కలగడం నిజంగా ఒక ప్రత్యేక అనుభూతి. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళామణులు ఒకే వేదికపై చేరి కార్యక్రమాన్ని వైభవంగా తీర్చిదిద్దారు. ఇంత అద్భుతమైన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ కి, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం కు హృదయపూర్వక అభినందనలు. మహిళా శక్తిని గౌరవించే ఈ మహోత్సవం నిజంగా స్ఫూర్తిదాయకం. మహిళా శక్తిని సెలబ్రేట్ చేసిన అందమైన వేడుకగా నా హృదయంలో నిలిచిపోయింది.

### సెలూన్ షాపుల కేటాయింపు

# జీవో అమలు చేయాలి

**మున్సిపల్ కార్పొరేషన్ ఇంచార్జి కమిషనర్‌కి యానాపు విజ్ఞప్తి**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** సెలూన్ షాపులకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 13ను రాజమహేద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ అమలు చేయాలని స్టేట్ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డెవలప్మెంట్ డైరెక్టర్ యానాపు ఏసు కోరారు. ఈమేరకు ఇంచార్జి కమిషనర్, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వరరావుకి గురువారం ఒక వినతి పత్రం సమర్పించారు. చేతివృత్తిదారులైన నాయీబ్రాహ్మణులకు జీవనోపాధి కల్పించుటకు షాపుల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని ఆ జీవోలో స్పష్టంగా పేర్కొన్నారని ఆయన తెలిపారు.సంప్రదాయ వృత్తిని ఆధారంగా చేసుకుని చాలామంది నాయీ బ్రాహ్మణులు జీవనం సాగిస్తున్నారని, ముఖ్యంగా నగరంలో అనేక నిరుపేద కుటుంబాలు స్థిరమైన ఆదాయం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని యానాపు ఏసు తెలిపారు. అందుచేత నగర పరిధిలో నూతనంగా నిర్మించిన షాపులు గాని, ప్రస్తుతం ఖాళీగా ఉన్న షాపులు గాని ఉంటె, జి.ఓ. ఎం.ఎస్. నెం.13 నిబంధనల ప్రకారం అర్హులైన నిరుపేద నాయీ బ్రాహ్మణులకు సెలూన్ షాపుల ఏర్పాటుకోసం కేటాయించాలని ఆయన కోరారు.

### సీతానగరం మండల

# విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి

**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలంలోని తేదీ05-03-2026 అనగా గురువారం నుండి ది.07-03-2026 శనివారం వరకు ఉదయం:10:00 గంటల నుండి సాయంత్రం05:00 గంటల వరకు పలు అభివృద్ధి మరియు మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా విద్యుత్ సరఫరా లో అంతరాయము కలుగును కావున తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం సీతానగరంలో వేలంపేట, సింగవరం కాలనీ, చిన్న కొండేపూడి మెయిన్ రోడ్డు, శ్రీరామ నగర్ గ్రామ పరిధిలోని గృహ, వాణిజ్య వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని తెలియజేయు చున్నాము. కావున విద్యుత్ వినియోగదారులందరూ ఈ అసౌకర్యానికి గమనించి డిపార్ట్మెంట్ వారికి సహకరించాలని జె పి బి నటరాజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ ఏపీ ఈపి డిసి ఎల్ రాజమహేంద్రవరం రూరల్ వారు కోరారు.



# అమ్మడి క్రేజ్ తగ్గడం లేదుగా..

## మరో స్టార్ హీరో సినిమాలో ఛాన్స్ కొట్టేసిన పుత్తడి బొమ్మ రాశి..

ఊహలు గుసగుసలాడే సినిమాతో హీరోయిన్ గా టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయ్యింది అందాల రాశీ. తొలి సినిమాతోనే తన అందంతో ప్రేక్షకులను కట్టిపడేసింది. బబ్లీ లుక్ లో భలే ఉందే ఈ అమ్మాయి అంటూ కుర్రాళ్లంతా రాశీ అందానికి ఫిదా అయ్యారు. ఊహలు గుసగుసలాడే సినిమాతో హీరోయిన్‌గా టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయ్యింది అందాల రాశీ. తొలి సినిమాతోనే తన అందంతో ప్రేక్షకులను కట్టిపడేసింది. బబ్లీ లుక్‌లో భలే ఉందే ఈ అమ్మాయి అంటూ కుర్రాళ్లంతా రాశీ అందానికి ఫిదా అయ్యారు. తొలి సినిమా మంచి విజయాన్ని అందుకోవడంతో ఈ ముద్దుగుమ్మకు వరుస ఆఫర్స్ క్యూ కట్టాయి. మీడియా రేంజ్ హీరోలందరి సరసన నటించి మెప్పించింది. అలాగే ఎన్టీఆర్ లాంటి స్టార్ హీరోల సరసన కూడా నటించి మెప్పించింది. ఎన్టీఆర్ నటించిన జై లవకుశ సినిమాలో రాశీ ఖన్నా హీరోయిన్ గా చేసింది. తెలుగుతో పాటు బాలీవుడ్ పై కూడా ఫోకస్ చేసింది ఈ వయ్యారి.. బాలీవుడ్ లో సినిమాలు సిరీస్ లు చేసింది ఈ అమ్మడు. వీటితో పాటు తమిళ్ లోనూ ఆఫర్స్ అందుకుంది. రాశీ ఖన్నా ఇప్పుడు వరుసగా సినిమాలు చేస్తూ దూసుకుపోతుంది. ప్రస్తుతం సిద్ధూ జొన్నల గడ్డ హీరోగా నటించిన తెలుసు కదా అనే సినిమాలో హీరోయిన్ గా నటించింది. ఈ అమ్మడి ఇప్పుడు బడా హీరోల సినిమాల్లో ఛాన్స్ అందుకుంటుంది. తెలుసు కదా సినిమా తర్వాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలోనూ నటిస్తుంది. ఈ సినిమాకు హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా షూటింగ్ జెట్ స్పీడ్ తో జరుగుతుంది. ఇదిలా ఉంటే ఇప్పుడు అందాల రాశీకి మరో క్రేజీ ఆఫర్ వచ్చిందని తెలుస్తుంది. మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న సినిమాలో రాశీ ఖన్నా హీరోయిన్‌గా సెలక్ట్ అయ్యిందని తెలుస్తుంది. చిరంజీవి బాబీ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. ఈ సినిమా ఇప్పటికే మాళవికామోహనన్ ను హీరోయిన్‌గా ఫిక్స్ చేశారని టాక్. ఇక ఇప్పుడు సెకండ్ హీరోయిన్‌గా రాశీ ఖన్నా కూడా ఈ సినిమాలో ఛాన్స్ అందుకుందని తెలుస్తుంది. ఈ వార్తలో వాస్తవమెంత అన్నది తెలియాల్సి ఉంది.

సినీ వాయిస్ CINEMA

## అక్కినేని యంగ్ హీరో నాగ చైతన్యకు

# తృటిలో తప్పిన ప్రమాదం..



అక్కినేని యంగ్ హీరో నాగ చైతన్యకు తృటిలో ప్రమాదం తప్పింది. ఓ మువీ కార్యక్రమానికి హాజరైన ఆయన ఊహించని విధంగా స్టేజ్ పై నుంచి కింద పడిపోయారు. ఈ అనుకోని ఘటనతో అక్కడున్న అభిమానులతోపాటు చిత్ర బృందం ఒక్కసారిగా షాక్ కు గురైంది.. టాలీవుడ్ యంగ్ హీరో నాగ చైతన్యకు తృటిలో ప్రమాదం తప్పింది. హైదరాబాద్‌లో ప్రసాద్స్ మల్టీప్లెక్స్‌లో జరిగిన 'వృషకర్మ' మువీ గ్లింప్స్ విడుదల కార్యక్రమంలో నాగ చైతన్య స్టేజ్‌పై నుంచి పడిపోయాడు. దీంతో ఒక్కసారిగా అక్కడున్న అభిమానులు, మువీ టీం తీవ్ర ఆందోళన చెందింది. అసలేం జరిగిందంటే.. అక్కినేని హీరో నాగ చైతన్య కొత్త మువీ 'వృషకర్మ' త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే. ఈ మూవీ నుంచి ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్ ఈవెంట్‌ను చిత్ర యూనిట్ హైదరాబాద్‌లోని ప్రసాద్స్ మల్టీప్లెక్స్‌లో గురువారం నిర్వహించారు. ఈ వేడుకలో భాగంగా స్టేజ్‌పై ఉన్నవారంతా ప్రసంగించారు. అనంతరం మీడియాతో ముచ్చటించేందుకు అందరూ కుర్చీల్లో కూర్చున్నారు. అయితే ఈ కార్యక్రమం జరుగుతున్న సమయంలో స్టేజ్‌పై కూర్చున్న హీరో నాగచైతన్య కుర్చీ ఒక్కసారిగా వెనక్కి పడిపోయింది. దీంతో నాగచైతన్య వెనక్కి పడిపోయాడు. ఇంతలో పక్కనే ఉన్న సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమై మెరుపువేగంతో ఆయన్ని పట్టుకోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఊహించని సంఘటనతో అక్కడ ఉన్న అభిమానులు, మువీ బృందం ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. నాగ చైతన్యకు దెబ్బలు తగిలాయేమోనని అభిమానులు, మువీ టీం కంగారు పడ్డారు. కానీ నాగ చైతన్య మాత్రం అప్పటికే తేరుకుని తనకేం కాలేదని చిరునవ్వుతో తన గురించి కంగారుపడుతున్న అభిమానులకు సైగ చేస్తూ వారిని శాంతింపజేశారు. ఆ వెంటనే పక్కనే ఉన్న దర్శకుడు కార్తీక్ దండు సహాయంతో లేచి మరో కుర్చీలో కూర్చుని తన ప్రసంగాన్ని కొనసాగించి అందరినీ అశ్చర్యపరిచాడు. వృషకర్మ చిత్రం గురించి మీడియా అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చాడు.

# షాకింగ్ న్యూస్..
# ప్లేయింగ్ 11 నుంచి నలుగురు ఔట్..

## అభిషేక్ శర్మ పరిస్థితి ఏంటంటే..?



2026 టీ20 ప్రపంచ కప్‌లో భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ జట్ల మధ్య రెండవ సెమీఫైనల్ జరగనుంది. ఈ మ్యాచ్‌కు ముందు, భారత జట్టు ప్లేయింగ్ ఎలెవెన్ గురించి కీలక వార్తలు వెలువడుతున్నాయి. ఏకంగా నలుగురు ప్లేయర్లు ప్లేయింగ్ 11 నుంచి తప్పుకున్నారు. 2026 టీ20 ప్రపంచ కప్ సెమీఫైనల్ గెలవడానికి టీం ఇండియా ఏ ప్లేయింగ్ XIతో బరిలోకి దిగనుందో ఆసక్తిగా మారింది. ఈ మ్యాచ్ ఇంగ్లాండ్‌తో జరగనుంది. నివేదికల ప్రకారం, భారత జట్టు తన ప్లేయింగ్ XIలో ఎటువంటి మార్పులు చేయకూడదని నిర్ణయించుకుంది. వెస్టిండీస్‌తో ఆడిన అదే జట్టు ముంబైలోని వాంఖడే స్టేడియంలో బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. అంటే నిరంతరం పేలవ ప్రదర్శన చేస్తున్న అభిషేక్ శర్మ కూడా సెమీఫైనల్ కోసం ప్లేయింగ్ XIలో చేరనున్నాడు.

**టీం ఇండియా ప్లేయింగ్ ఎలెవన్..**

అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, శివమ్ దూబే, వరుణ్ చక్రవర్తి, అర్ష్దీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రా. దీని అర్థం కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, రింకు సింగ్, వాషింగ్టన్ సుందర్ ఇంగ్లాండ్‌తో జరిగే సెమీ-ఫైనల్ మ్యాచ్‌లో ఆడరు.

**ఓపెనింగ్‌లో మార్పు ఉంటుందా?**

టీం ఇండియా తమ ప్లేయింగ్ ఎలెవన్‌లో ఎటువంటి మార్పులు చేయలేదు. కానీ, భారత జట్టు తమ ఓపెనింగ్ జోడీని మారుస్తుందా అనేది పెద్ద ప్రశ్నగా మారింది. అభిషేక్ శర్మ ఓపెనింగ్‌లో నిరంతరం విఫలమయ్యాడు. అతను వరుసగా మూడుసార్లు 0 పరుగులకే ఔటయ్యాడు. అతను జింబాబ్వేపై అర్ధ సెంచరీ చేశాడు. కానీ, వెస్టిండీస్‌పై కేవలం 10 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అయితే, వాంఖడే స్టేడియంలో అభిషేక్ శర్మ ప్రదర్శన అద్భుతంగా ఉంది. ఈ మైదానంలో ఇంగ్లాండ్‌పై సెంచరీ కూడా చేశాడు.

**టీ20 ప్రపంచకప్‌లో భారత్-ఇంగ్లాండ్ మధ్య గట్టి పోటీ..**

టీ20 ప్రపంచ కప్‌లో భారతదేశం మరియు ఇంగ్లాండ్ మధ్య ఎప్పుడూ తీవ్రమైన పోటీ ఉంటుంది. రెండు జట్లు ఇప్పటివరకు ఐదు మ్యాచ్‌లు ఆడాయి, భారతదేశం మూడు మ్యాచ్‌లు గెలిచింది మరియు ఇంగ్లాండ్ రెండు మ్యాచ్‌లు గెలిచింది. గత ౦20 ప్రపంచ కప్‌లో భారతదేశం ఇంగ్లాండ్‌ను ఓడించింది. ఇప్పుడు, ఎవరు గెలుస్తారో చూడాలి.

క్రీడా వాయిస్

## టీమిండియాకు

# బ్యాడ్ న్యూస్..

## టాస్ గెలిచిన ఇంగ్లాండ్.. ఆ సెంటిమెంట్ రిపీటైతే కష్టమే?




టీ20 ప్రపంచ కప్‌లో రెండవ సెమీఫైనల్ భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య కీలక మ్యాచ్ జరుగుతోంది. ఈ క్రమంలో టాస్ గెలిచిన ఇంగ్లాండ్ జట్టు ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. దీంతో భారత జట్టు తొలుత బ్యాటింగ్ చేయనుంది. టీ20 ప్రపంచ కప్‌లో రెండవ సెమీఫైనల్ భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య కీలక మ్యాచ్ జరుగుతోంది. ఈ క్రమంలో టాస్ గెలిచిన ఇంగ్లాండ్ జట్టు ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. దీంతో భారత జట్టు తొలుత బ్యాటింగ్ చేయనుంది. టీమిండియా ప్లేయింగ్ 11లో ఎటువంటి మార్పులు చేయలేదు. ఇంగ్లాండ్ రెహాన్ అహ్మద్ స్థానంలో జామీ ఓవర్టన్‌ను చేర్చుకుంది. ఈ రెండు జట్లు వరుసగా మూడోసారి సెమీఫైనల్లో తలపడుతున్నాయి. గతంలో 2022, 2024లో ఈ రెండు జట్లు తలపడ్డాయి. రెండు జట్లు 1-1 తేడాతో గెలిచాయి. సెమీఫైనల్స్ గెలిచిన తర్వాత, రెండు జట్లు కూడా ఫైనల్‌ను గెలుచుకున్నాయి.

**భారత్ :** అభిషేక్ శర్మ, సంజూ శాంసన్(కీపర్), ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్, అర్ష్దీప్ సింగ్, వరుణ్ చకరవర్తి, జస్ప్రీత్ బుమ్రా.

**ఇంగ్లాండ్ :** ఫిలిప్ సాల్ట్, జోస్ బట్లర్(కీపర్), హ్యారీ బ్రూక్(కెప్టెన్), జాకబ్ బెథెల్, టామ్ బాంటన్, సామ్ కుర్రాన్, విల్ జాక్స్, జామీ ఓవర్టన్, లియామ్ డాసన్, జోఫ్రా ఆర్చర్, ఆదిల్ రషీద్.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com